# మనం

/manamnews
www.manamnews.com

జనం కోసం అక్షర యజ్ఞం..

కరీంనగర్
బుధవారం
11-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 252
పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


భాద్రపద మాసం, బుధవారం, తిథి : ద్వాదశి సా.05.37 వరకు, నక్షత్రం: మఖ, ఉ:08.45 వరకు, వర్జ్యం: సా.05.42-07.29 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.39-12.26 వరకు, రాహుకాలం: మ.12.02-01.30 వరకు



## మీరు చరిత్ర సృష్టించారు..

మాదక ద్రవ్యాల రహిత భారత్ సందేశాన్ని వ్యాప్తి చేయాలి

భారత ఆసియా క్రీడల బృందంతో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 10 :** రికార్డు స్థాయిలో పతకాలు సాధించిన భారత ఆసియా క్రీడల బృందంతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సంభాషించి చరిత్ర సృష్టించారని అన్నారు. మహిళా అథ్లెట్లు చాలా బాగా రాణించారని, ఇది దేశ కూతుళ్ల సామర్థ్యాన్ని తెలియజేస్తుందని ప్రధాని అన్నారు. 'మా నారీ శక్తి' ఆసియా గేమ్స్‌లో చాలా బాగా ఆడినందుకు నేను గర్వపడుతున్నాను. ఇది భారతదేశపు కుమార్తెల సామర్థ్యాన్ని గురించి చెబుతుంది అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 19వ ఆసియా క్రీడల్లో పతకాలు సాధించి అసాధారణ ప్రదర్శన కనబర్చిన భారత అథ్లెట్లకు 'డ్రగ్ రహిత భారత్' సందేశాన్ని ప్రచారం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్చంద్ స్టేడియంలో చైనాలోని హాంగ్జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో పాల్గొన్న భారత బృందంతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. అథ్లెట్లను ఉద్దేశించి, మోడీ వారి విజయాన్ని ప్రశంసించారు. డ్రగ్స్‌పై దేశం యొక్క కొనసాగుతున్న

..మిగతా 2లో



## హమాస్‌తో యుద్ధం వేళ..

మోదీకి నెతన్యాహు ఫోన్..

ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని భారత్ హామీ

2

రాబోయేది

# డబుల్ ఇంజిన్ సర్కార్

కేసీఆర్‌కు మూడోసారి అధికారం కట్టబెట్టవద్దు — అమిత్ షా



కేసీఆర్‌ను గద్దెదించి.. బీజేపీకి అధికారం ఇచ్చేందుకు పిడికిలి బిగించండి : అమిత్ షా

- ఆదివాసీల అభివృద్ధి కోసం బీజేపీ ఎన్నో పథకాలు తీసుకొచ్చింది
- ఎన్నికలు రాగానే కాంగ్రెస్ వాళ్లు కొత్త బట్టలు వేసుకొని వస్తారు
- పదేళ్లలో ప్రజల కోసం కేసీఆర్ ప్రభుత్వం ఏమీ చేయలేదు
- కేసీఆర్ తన కొడుకు, కూతురు కోసమేపని చేశారు
- డిసెంబర్ 3న తెలంగాణలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమే
- నేటితరం రజాకార్ల నుంచి తెలంగాణను రక్షించేది బీజేపీ మాత్రమే
- బీజేపీ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ విమోచన దినోత్సవం ప్రతి జిల్లాలో నిర్వహిస్తాం : కేంద్ర మంత్రి అమిత్ షా

కొమరం భీం పేరు విని రోమాలు నిక్కబోడుచుకుంటాయి.. పదేళ్ల కేసీఆర్ పాలనలో సామాన్యులు, రైతులు, ఆదివాసీల సమస్యలు తీరలేదు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరం. పదేళ్లలో కేటీఆర్‌ను సీఎం ఎలా చేయాలనే ఆలోచన మాత్రమే చేశారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడమే కేసీఆర్ లక్ష్యం. కేసీఆర్ కేవలం తన కుటుంబం కోసమేపని చేశారు.. కేసీఆర్ తన కుమార్తె, కుమారుడి గురించి మాత్రమే ఆలోచిస్తారు.. ప్రధాని మోదీ ఆదివాసీ బిడ్డను రాష్ట్రపతి చేశారు.. ఆదివాసీల అభివృద్ధి కోసం బీజేపీ ఎన్నో పథకాలు తీసుకొచ్చింది.. ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదు. కేసీఆర్ ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు

\- అమిత్ షా

వివరాలు.. 2లో

## బీజేపీ.. సిద్ధాంతాల పార్టీ..

బీఆర్ఎస్‌కు ఏం విధానం ఉంది?

కేంద్ర మంత్రి అమిత్ షా

2



## వీడిన ఉత్కంఠ

నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలి

పల్లా, ముత్తిరెడ్డి మధ్య కుదిరిన సయోధ్య

జనగామ జిల్లాలో మూడు సీట్లు మనమే కైవసం చేసుకోవాలి

జనగామ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ సమావేశంలో మంత్రి కేటీఆర్

పల్లా రాజేశ్వర్ రెడ్డిని గెలిపించండి..

జనగామ నేతలకు కేటీఆర్ పిలుపు

వివరాలు.. 2లో



## 18న మేడ్చల్‌లో కేసీఆర్ బహిరంగ సభ

విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్న మంత్రి

2



## ఇజ్రాయెల్‌పై దాడిలో మా హస్తం లేదు..

ఇరాన్ సుప్రీం లీడర్

**టెహ్రాన్, అక్టోబర్ 10 :** ఇజ్రాయెల్‌పై గత వారం హమాస్ మిలిటెంట్లు చేసిన దాడిలో ఇరాన్ పాత్ర లేదని ఆ దేశాధినేత వివరణ ఇచ్చుకొన్నారు. దాడి జరిగిన తర్వాత తొలిసారి ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ మంగళవారం టెలివిజన్‌లో ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ సైన్యం, ఇంటెలిజెన్స్‌కు ఇది కోలుకోలేని ఎదురుదెబ్బగా అభివర్ణించారు. యూదు పాలకులపై దాడికి ప్లాన్ చేసిన వారి హస్తాన్ని ముద్దాడుతాను. భయంకరమైన భూకంపం (హమాస్ దాడులు) కీలక వసతులను ధ్వంసం చేశాయి. వాటిని సరిచేయడం అంత తేలికకాదు. ఈ విపత్తుకు యూదు పాలకులు తమనుతాము నిందించుకోవాలి అని పేర్కొన్నారు. ఆ సమయంలో ఆయన పాలస్తీనా స్కార్ఫ్‌ను ధరించారు. గత కొన్నేళ్లుగా హమాస్‌కుఇరాన్ నుంచి భారీగా ఆయుధ, నగదు రూపంలో సాయం అందుతోందనే విమర్శలున్నాయి. ఇరాన్

..మిగతా 2లో

## బీఆర్ఎస్ మేనిఫెస్టో వస్తే.. ప్రతిపక్షాలకు మైండ్ బ్లాకే

ఎన్నికల సమయాల్లో.. ఫేక్ సర్వేలు, గూగుల్ ప్రచారాలు కాంగ్రెస్ పార్టీకి అలవాటు

మనకు నీళ్లు వస్తే కాంగ్రెసోళ్లు కన్నీళ్లు పెట్టుకున్నారు: మంత్రి హరీష్ రావు



**సిద్దిపేట, అక్టోబర్ 10 (మనం న్యూస్):** ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఫేక్ సర్వేలు, గూగుల్ ప్రచారాలు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. కనీసం టికెట్లు ఇచ్చుకోలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందని మంత్రి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 15న హుస్నాబాద్‌లో నిర్వహించనున్న సభా ఏర్పాట్లను మంత్రి హరీశ్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే సతీశ్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తొలి ఎన్నికల సభ హుస్నాబాద్‌లో నిర్వహించడం అంటే.. ఇక్కడి ప్రజల మీద ఉన్న ప్రేమ, నమ్మకం అని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో మొదటి సభ ఇక్కడే నిర్వహించారు. అదే విధంగా ఈసారి కూడా హుస్నాబాద్ నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. హుస్నాబాద్ నియోజకవర్గం అంటే లక్ష్మికటాక్ష నియోజకవర్గం. మంచి జరుగుతుంది అని ఇక్కడ నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. పండుగ వాతావరణంలో కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని

..మిగతా 2లో

## కాంగ్రెసోళ్లకు ఇప్పుడు బీసీలు గుర్తుకు వచ్చారా?

తెలంగాణలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదు.. బీసీల ప్రభుత్వం'

కుల వృత్తులు పూర్వ వైభవం తీసుకొచ్చిన మహానేత కేసీఆర్

మద్యం టెండర్లలో 15శాతం గౌడ కులస్తులకు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్

గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత



**నిజామాబాద్, అక్టోబర్ 10 (మనం ప్రతినిధి):** బీసీ జనగణన చేయాలని కొత్తగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని ఎమెల్సీ కవిత విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంటేశ్వర్‌లో నిర్వహించిన గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మంగళవారం కవిత మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తొలి సీఎం కేసీఆర్ అని ప్రశంసించారు. రాహుల్ గాంధీ 60ఏళ్ల నుంచి

..మిగతా 2లో

## మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు హైకోర్టులో ఊరట

అసెంబ్లీ ఎన్నిక చెల్లదంటూ వేసిన పిటిషన్ కొట్టివేత




వివరాలు.. 2లో

## ధర్మమే గెలిచింది

వారిద్దరి వల్లే జిల్లా నాశనమైంది..

శ్రీనివాస్ గౌడ్ సంచలన ఆరోపణలు

ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ గెలుపు ఖాయం : శ్రీనివాస్‌గౌడ్

### మంచిమాట

శత్రువు నిన్ను ఎంత బాధపెట్టినా
శత్రువు ముందు బాధపడకు
ఎందుకంటే నీ బాధ వారికి
ఇంకా సంతోషాన్ని ఇస్తుందే
కానీ కనికరించేలా చేయదు
కష్టమో, నష్టమో నవ్వుతూనే
ఉండు నీ నవ్వే వారి
గుండెలో మంట పెట్టేది.

శుభోదయం




## దసరాకు ఊరెళ్తున్నారా?

ప్రయాణికులకు టీఎస్ఆర్టీసీ బంపర్ ఆఫర్!

లక్కీడ్రా ద్వారా నగదు బహుమతులు గెలుచుకొనే ఛాన్స్

13 నుంచి 24 వరకు 5,265 ప్రత్యేక బస్సుల ఏర్పాటు

టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్

**హైదరాబాద్, అక్టోబర్ 10 (మనం న్యూస్):** ప్రయాణికులను ఆకట్టుకొనేందుకు టీఎస్ఆర్టీసీ వినూత్న ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల రాఖీపౌర్ణమికి

..మిగతా 2లో

## భారీగా హవాలా నగదు పట్టివేత



బంజారాహిల్స్‌లో పట్టుబడిన రూ.3 కోట్లు..

అన్నీ 500 రూపాయల కట్టలు స్వాధీనం

ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

వివరాలు.. 5లో

# మీరు చరిత్ర సృష్టించారు..

(మొదటిపేజీ తరువాయి)



పోరాటంలో వారు పెద్ద పాత్ర పోషించగలరని డ్రగ్స్ రహిత భారతదేశాన్ని ప్రోత్సహించాలని వారిని కోరారు. పాఠశాలలను సందర్శించిన క్రీడాకారులు ఉన్నారు, వారిలో కొందరు ఇక్కడ ఉన్నారు. నీరజ్ పాఠశాలను సందర్శించినట్లు నాకు తెలుసు మరియు పిల్లలు అతనిని ప్రశంసించారు. మన దేశం ప్రస్తుతం డ్రగ్స్‌పై నిర్ణయాత్మక పోరాటంలో నిమగ్నమై ఉంది, డ్రగ్స్ యొక్క ప్రతికూల ప్రభావాల గురించి మీకు తెలుసు మరియు ఒక క్రీడాకారుడు తెలియకుండా డోపింగ్కు పాల్పడినా, ఆ అథ్లెట్ కెరీర్ నాశనం అవుతుంది. కొన్నిసార్లు విజయం కోసం కోరిక అథ్లెట్ను వేరే మార్గంలో తీసుకువెళుతుంది. మీ (అథ్లెట్లు) ద్వారా యువకులకు అవగాహన కల్పించాలనుకుంటున్నాను. ఇందులో మీరు పెద్ద పాత్ర పోషించవచ్చు. మీరు మానసిక శక్తి మరియు నిబద్ధత యొక్క విగ్రహం. మీ శారీరక బలాన్ని ఉపయోగించి మీరు పతకాలు గెలవలేరు. మానసిక బలం పెద్ద పాత్ర పోషిస్తుంది. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి యువతకు అవగాహన కల్పించడంలో మీరే అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్' అని ప్రధాని మోదీ అన్నారు. భారతదేశం వారి ఆసియా క్రీడల చరిత్రలో మొదటిసారిగా 100 పతకాల మార్కును అధిగమించింది, ఇది చాలా కాలం తర్వాత దేశానికి మరపురాని క్రీడా ఈవెంట్లలో ఒకటిగా నిలిచింది మరియు ఇందులో పాల్గొనే క్రీడాకారులందరినీ చిరస్థాయిగా నిలిపింది. భారతదేశం 28 స్వర్ణాలు, 38 రజతాలు మరియు 41 కాంస్యాలతో 107 పతకాలతో రికార్డు స్థాయిలో 2023 ఆసియా క్రీడల ప్రచారాన్ని ముగించింది. జకార్తా 2018లో జరిగిన చివరి ఎడిషన్లో 570 మందితో కూడిన భారత జట్టు 70 పతకాలు, 16 స్వర్ణాలు, 23 రజతాలు మరియు 31 కాంస్యాలతో సాధించిన రికార్డును ఇది అధిగమించింది. హాంగ్జౌలో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో భారత్‌కు షూటింగ్‌లో 22 పతకాలతో పాటు ఏడు స్వర్ణాలు ఉన్నాయి.

అథ్లెటిక్స్, జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా యొక్క విజయవంతమైన టైటిల్ డిఫెన్స్ ద్వారా 14 రజతాలు మరియు తొమ్మిది కాంస్యాలతో పాటు ఆరు స్వర్ణాలతో రెండవ స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్ దేశానికి మొత్తం 29 పతకాలు అందించింది.

# హమాస్‌తో యుద్ధం వేళ..

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 : హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం భీకర పోరు కొనసాగిస్తున్న వేళ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.. భారత ప్రధాని నరేంద్రమోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ.. ఉగ్రదాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్ -హమాస్ మధ్య ఘర్షణలు, అక్కడి తాజా పరిస్థితుల గురించి నెతన్యాహు ఫోన్ చేసి తెలియజేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇజ్రాయెల్‌కు యావత్ భారతావని అండగా నిలుస్తుంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే.. దాన్ని భారత్ నిస్సందేహంగా, తీవ్రంగా ఖండిస్తుంది అని మోదీ ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించారు. మా దేశంలోకి చొరబడి మారణహోమం సృష్టించిన హమాస్ మిలిటెంట్లను తుడిచిపెట్టేందుకు ఇజ్రాయెల్ సైన్యం భీకర పోరు కొనసాగిస్తోంది. గాజా స్ట్రిప్‌లోని హమాస్ స్థావరాలపై వైమానిక దాడులు చేస్తోంది. మరోవైపు మా భూభాగంలోకి చొరబడిన దాదాపు 1500 మంది హమాస్ ఉగ్రవాదులను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. హమాస్‌తో యుద్ధం నేపథ్యంలో దేశ ప్రజలనుద్దేశించి నెతన్యాహు మాట్లాడారు. తమ దేశంపై దాడి చేసి హమాస్ ఘోర తప్పిదం చేసిందని, అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ యుద్ధాన్ని తాము మొదలుపెట్టలేదని, కానీ ముగించేది మాత్రం తామేనని అన్నారు. తమ ప్రతిదాడి హమాస్తో పాటు, ఇజ్రాయెల్ శత్రు దేశాలకు దశాబ్దాలపాటు గుర్తుండిపోతుందని నెతన్యాహు హెచ్చరించారు.

## ఇజ్రాయెల్‌పై దాడిలో మా హస్తం లేదు..

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి వరకు ఇజ్రాయెల్‌ను గుర్తించలేదు. ఈ నేపథ్యంలో హమాస్ బలప డటానికి సాయం చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై దాడి వెనుక ఇరాన్ హస్తం ఉండొచ్చని అమెరికా సోమవారం అనుమానం వ్యక్తం చేసింది. అదే సమయంలో దానికి తగిన ఇంటెలిజెన్స్ తమ వద్ద లేదని వెల్లడించింది. హమాస్‌పై ఇజ్రాయెల్ చేసే యుద్ధంలో తల దూర్చవద్దని ఇప్పటికే అగ్రరాజ్యం హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై తాము చేసిన మెరుపు దాడికి ఇరాన్ మద్దతు ఉందని మిలిటెంట్ సంస్థ హమాస్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి ఘాజీ హమీద్ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. ఇజ్రాయెల్-సౌదీ సంబంధాలు ఏర్పర్చుకోవ డానికి అవసరమైన ఒప్పందానికి చేరువైన సమయంలో ఈ దాడి చోటు చేసుకొంది. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదరకుండా చేసేందుకు ఇరాన్ ప్రోత్సాహంతోనే ఈ దాడి జరిగి ఉంటుందనే అనుమానం ఉంది. అయితే.. అంతర్జాతీయగా పరిణామాలు తీవ్రంగా మారుతుండటంతో ఇరాన్ మెల్లగా తన స్వరం మారుస్తోంది. తనకు ఈ దాడితో నేరుగా సంబంధం లేదని చెప్పుకొంటోంది.

## బీఆర్ఎస్ మేనిఫెస్టో వస్తే.. ప్రతిపక్షాలకు మైండ్ బ్లాకే

(మొదటిపేజీ తరువాయి)


పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మాటలు, డబ్బు మూటలు, కర్ఫ్యూలకు, మతకల్లోలాకు చిరునామా అని ధ్వజమెత్తారు. ముఠా రాజకీయాలతో ఢిల్లీలో కాంగ్రెస్ టికెట్ల పంచాయితీ నడుస్తుందన్నారు. బీఆర్ఎస్ టికెట్లు ప్రకటించి 50 రోజులైనా ఇప్పటికీ టికెట్లు ప్రకటించుకోలేని పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. 8 టీఎంసీలతో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసుకున్నామని తెలిపారు. నీళ్లు వస్తే ప్రతి ఒక్కరు సంతోషం పడ్డారు. ప్రతిపక్షాలు మాత్రం కన్నీళ్లు పెట్టుకుంటున్నాయని విమర్శించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీష్ బాబు ఉండటం మీ అందరి అదృష్టమని పేర్కొన్నారు. కేసీఆర్ మేనిఫెస్టో ప్రకటించిన తర్వాత ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ అవడం ఖాయమని హరీష్ రావు స్పష్టం చేశారు. 2014, 18 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని తేల్చిచెప్పారు.

రాబోయేది..

# డబుల్ ఇంజిన్ సర్కార్



ఆదిలాబాద్‌లో నినదిస్తే.. హైదరాబాద్‌లో కేసీఆర్‌కు వినిపించాలన్న అమిత్‌షా.. డిసెంబర్ 3 తర్వాత తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం రావాలి.. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి జిల్లాల్లో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని అమిత్ షా ప్రకటించారు.



ఆదిలాబాద్, అక్టోబర్ 10 (మనం న్యూస్): రాష్ట్రంలో ఎన్నికల సైరన్ మోగడంతో.. పార్టీల ప్రచార హోరు మొదలైంది. ఈసారి ఎలాగైనా అధికార పీఠం దక్కించుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్న భారతీయ జనతా పార్టీ.. ఆ దిశగా ప్రచారం ప్రారంభించింది. గతవారం మోదీ సభలో కార్యకర్తల్లో ఊపు తీసుకొచ్చిన హైకమాండ్.. ఇవాళ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తీసుకొచ్చింది. మంగళవారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ జనగర్జన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అమిత్ షాకు తరుణ్‌ఛుగ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్, ఈటల రాజేందర్ స్వాగతం పలికారు. జనగర్జన వేదికగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పవిత్ర భూమి అయినటువంటి ఆదిలాబాద్‌కు వచ్చాను. కుమురం భీం పేరు చెబితేనే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఆయనను స్మరించుకుంటూ ప్రసంగం ప్రారంభిస్తాను. రజాకార్లపై పోరాడిన వీరభూమికి నమస్కారం చేస్తున్నాను. పదేళ్లుగా కేసీఆర్ తెలంగాణ పేదల సమస్యలు తీర్చలేదు. ఈ రాష్ట్ర సీఎం.. రైతులు, దళితులు, గిరిజనులను పట్టించుకోలేదు. కేసీఆర్ మాత్రం పదేళ్లుగా తన కుటుంబం కోసమే ఆలోచించారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడం కోసమే.. నిరంతరం కేసీఆర్ ఆలోచించేవారని అమిత్ షా అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే లక్ష్యంగా విమర్శలు చేశారు. గిరిజనులను మోసం చేసిన కేసీఆర్‌కు మూడోసారి అధికారం కట్టబెట్టవద్దని అమిత్ షా జిల్లా ప్రజలకు సూచించారు. అవినీతిలో తెలంగాణను నెంబర్‌వన్‌ను చేసిన కేసీఆర్ ప్రభుత్వం ఇక అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తు కారు అయితే స్టీరింగ్ మాత్రం మజ్లిస్ చేతిలో ఉందని.. అలాంటి పార్టీ తెలంగాణను ఏ విధంగా అభివృద్ధిలోకి తీసుకు వస్తుందని అమిత్ షా ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్ వాళ్లు కొత్త బట్టలు వేసుకొని వస్తారని కేంద్రహోంమంత్రి అమిత్ షా ఎద్దేవా చేశారు. ఆ పార్టీ పేదల గురించి మాట్లాడుతుంది కానీ.. పేదల కోసం ఏం చేయదని విమర్శించారు. గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం చేసిందేమీ లేదన్నారు. సీఎం కేసీఆర్ గిరిజనుల కోసం ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ వాటిని ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఆదివాసీలకు సీఎం రెండు పడకల ఇళ్లు ఇస్తామన్నారు.. కానీ ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ చేశామని కేసీఆర్ పదేపదే చెబుతుంటాని.. కేవలం రైతుల ఆత్మహత్యల విషయంలోనే తెలంగాణను నంబర్ వన్ చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఎన్నికల గుర్తు కారు.. కానీ ఆ కారు స్టీరింగ్ మాత్రం ఒవైసీ దగ్గర ఉంటుందని అమిత్ షా ఎద్దేవా చేశారు. ఎంఐఎం దగ్గర స్టీరింగ్ ఉన్న బీఆర్ఎస్ సర్కారు అవసరమా అంటూ ప్రజలను ప్రశ్నించారు. డిసెంబరు 3న హైదరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరాలి. మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. కేసీఆర్ సర్కార్ వైఖరి వల్ల గిరిజన వర్సిటీ ఏర్పాటు ఆలస్యమైంది. గిరిజన వర్సిటీకి కేసీఆర్ సర్కారు జాగా చూపించలేదన్నారు. బీజేపీ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ.. మోదీ ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించందని చెప్పారు. కృష్ణా ట్రైబ్యునల్ నిబంధనలు మార్చి తెలంగాణకు నీటి ఇబ్బందులు లేకుండా ప్రధాని చేశారని గుర్తు చేశారు. ప్రతి పేద మహిళకు వంట సిలిండర్ ఇచ్చామని.. రైతుల ఖాతాల్లో ఏటా రూ.6వేలు జమ చేస్తున్నామన్నారు. దళితులు, గిరిజనుల కోసం మోదీ 9 ఏళ్లుగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో ఆధునిక రజాకర్ల నుంచి ప్రజలను బీజేపీ మాత్రమే రక్షిస్తుంది. బీఆర్ఎస్‌ను ఇంటికి పంపి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి. తెలంగాణలో జనతా సర్కార్ రావాలి. కొడుకు, కూతురు కోసం పనిచేసే ప్రభుత్వం కాదు. పేదలు, రైతులు, ఆదివాసీల కోసం పనిచేసే ప్రభుత్వం రావాలి. 2024లో మరోసారి మోదీని ప్రధానిని చేయాలి. కేసీఆర్‌ను గద్దెదించి.. బీజేపీకి అధికారం ఇచ్చేందుకు పిడికిలి బిగించండి. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే అక్కడా.. ఇక్కడా మోదీయే. పసుపు రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు కాబోతుంది. రూ.200 కోట్లతో ఆదివాసీ వీరుల స్మారక మ్యూజియాలు నిర్మిస్తున్నాం అని అమిత్షా తెలిపారు.

ఈ బహిరంగ సభలో తరుణ్‌ఛుగ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్, ఈటల రాజేందర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ.. సిద్ధాంతాల పార్టీ..

### ఇది అమృతకాలం.. సంకల్పం తీసుకోవాల్సిన సమయం: అమిత్ షా

హైదరాబాద్, అక్టోబర్ 10 (మనం న్యూస్): బీజేపీ సిద్ధాంతాలు ఆధారంగా నడిచే పార్టీ అని.. బీఆర్ఎస్‌కు ఏ విధానం ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగిన తెలంగాణ బీజేపీ మేధావుల సమావేశంలో ఆయన పాల్గొని.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. బీఆర్ఎస్ కుటుంబ పార్టీ.. ఇలాంటి పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా ఉండవని కేంద్రమంత్రి అమిత్‌షా చెప్పారు. వచ్చే 50 ఏళ్లలో ప్రపంచంలోనే భారత్ కీలక పాత్ర పోషించబోతోందని అమిత్ షా ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక రంగాల్లో భారతదేశం అగ్రస్థానానికి చేరబోతోందని అన్నారు. మోదీ నాయకత్వంలో దేశం ప్రగతిపథంలో దూసుకుపోతోందని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాల ఆధారంగా నడిచే పార్టీనని.. బీఆర్ఎస్‌కు ఏం విధానం ఉందో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కుటుంబ పార్టీనని.. కేటీఆర్‌ను సీఎం చేయడం తప్ప కేసీఆర్‌కు మరో విధానం అన్నదే లేదని అమిత్ షా విమర్శించారు. ఇది అమృత కాలం.. సంకల్పం తీసుకోవాల్సిన కాలమని అన్నారు. బీజేపీ హయాంలో 12 కోట్ల మందికి ఇళ్లు నిర్మించి ఇచ్చామని వివరించారు. మోదీ ప్రభుత్వం 9 కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిందన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోనే కొవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని స్పష్టం చేశారు. కొవిడ్ వ్యాక్సిన్లను రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారని.. డిజిటల్ పేమెంట్ల వ్యవస్థను దేశవ్యాప్తం చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కుటుంబ, అవినీతి పార్టీ చేతుల్లో రాష్ట్రాన్ని పెట్టొద్దని అమిత్ షా తెలంగాణ ప్రజలను కోరారు. మజ్లిస్‌తో దోస్తీ కారణంగానే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేసీఆర్ నిర్వహించలేదన్నారు. కేంద్రం రెండేళ్లుగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహిస్తోందని మేధావుల సభలో చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలపైనే తెలంగాణ పోరాటం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. మోదీ సర్కార్ తెలంగాణకు తొమ్మిదేళ్లలో 9 లక్షల కోట్ల రూపాయలను ఇచ్చిందని అన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ ఏం చేశారని.. ఇక్కడి ప్రజలు అడుగుతున్నారన్నారు. తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కు కేసీఆర్‌కు లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలు ఆడుతున్నాయని.. మోదీపై భరోసా ఉంచి ఈసారి తెలంగాణలో అవకాశం ఇవ్వాలని అమిత్ షా తెలంగాణ ప్రజలను కోరారు.

# కాంగ్రెసోళ్లకు ఇప్పుడు బీసీలు గుర్తుకు వచ్చారా?

(మొదటిపేజీ తరువాయి)

ఏం చేశారు ప్రశ్నించారు. రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఎంత మంది బిసిలు ఉన్నారో గుర్తించాలని కవిత డిమాండ్ చేశారు. బిసి మంత్రిత్వ శాఖ గురించి బిఆర్ఎస్ ఎన్ని సార్లు అడిగినా కేంద్రంలో మోడీ ప్రభుత్వం స్పందించలేదని, కాంగ్రెస్ కనీసం మాట్లాడలేదని చురకలంటించారు. 60 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు చేయని కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ఇప్పుడు కుల గణన చేస్తామని మాట్లాడటం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడు బిసిలు గుర్తుకు వచ్చారా? అని ప్రశించారు. దేశంలో ఎంత మంది బిసిలు ఉన్నారో లెక్క తేల్చాలని కవిత డిమాండ్ చేశారు. మహిళ బిల్లులో కూడా బిసి మహిళల కోట తేల్చాలని, గణేష్ గుప్తా కు ఓటు వేస్తే సీఎం కేసీఆర్‌కు వేసినట్టేనని ఆమె స్పష్టం చేశారు. కుల వృత్తులు పూర్వ వైభవం తీసుకువస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్. ఎన్నికల నగారా నిన్ననే మోగింది. మొట్టమొదటి సమావేశం గౌడ కుల బాంధవులతో జరురుకోవటం సంతోంగా ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గత ప్రభుత్వాలు గౌడ కులస్తులను కల్లు వ్యాపారాన్ని చిన్న చూపు చూశారు. కానీ కేసీఆర్ ఆనాడే ఉద్యమ సమయంలో చెప్పారు. తెలంగాణ ఏర్పాటు అయితే గౌడ కులస్తులకు అండగా ఉంటాం అన్నారు. అలాంటి కులవృత్తులను పునరుద్ధరించేందుకు సీఎం కేసీఆర్ విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. గీత కార్మికులకు ఏమైనా సమస్యలు ఉంటే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం పాలసీగా తీసుకొని ఈత వనాలని పెంచుతున్నది. మద్యం టెండర్లలో 15 శాతం గౌడ కులస్తులకు రిజర్వేషన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నం. గత ప్రభుత్వాల కాలంలో నిజామాబాద్ నుంచి ఎంతో మంది పెద్ద నాయకులు పనిచేశారు. జిల్లాకు ఒకటే బీసీ హాస్టల్ ఉండేది. అలాంటిది ఈరోజు 15 బీసీ హాస్టల్స్‌ను ఏర్పాటు చేసుకున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది బీసీ బిడ్డలకు ఫీజు రియంబర్స్ మెంట్ ఇస్తున్నాం. తెలంగాణలోఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదు, బీసీల ప్రభుత్వం అన్నారు. ఎన్నికలప్పుడు అనేక పార్టీలు వస్తాయి. వారిని నిలదీయండి. బీఆర్ఎస్ పార్టీగా పని చేశాం కాబట్టి హక్కుగా ప్రజల వద్దకు వస్తున్నాం. అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 3 తర్వాత మళ్లీ ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కలిసి పాల్గొన్నారు.

# వీడిన ఉత్కంఠ

హైదరాబాద్, అక్టోబర్ 10 (మనం న్యూస్): జనగాం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్ రెడ్డికి మద్దతివ్వాలని ఆ నియోజకవర్గం టికెట్ ఆశిస్తున్న నేతలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.టి.రామారావు తెలిపారు. ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మంత్రుల నివాసంలోని క్లబ్ హౌజ్లో మంగళవారం జనగాం బిఆర్ఎస్ ఆశావహులతో మంత్రి కెటిఆర్ సమావేశం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ తరపున ఎంఎల్ఏ టికెట్ ఆశిస్తున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఇతర ఆశావహుల మధ్య మంత్రి కెటిఆర్ సయోధ్య కుదిర్చారు. ఈ సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రైతు బంధు సమితి చైర్మెన్, ఎంఎల్ఏ టి.రాజయ్య, మాజీ ఎంఎల్సిలు బోడకుంటి వెంకటేశ్వర్లు, నారదాసు లక్ష్మణ్ రావు, జనగామ నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయమని.. కష్టపడిన నేతలు, కార్యకర్తలందరికీ తగిన అవకాశాలు ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పనిచేసి, జనగామ జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ పార్టీ గెలిపించడానికి అన్నారు. ఈ నెల 16న జనగామలో నిర్వహించే ఎన్నికల మొదటి సభను విజయవంతం చేయాలని నాయకులకు విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ పార్టీ తరపున ఎంఎల్ఏ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చినందుకు మంత్రి కేటీఆర్‌కు పల్లా రాజేశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

**జనగాం బిఆర్ఎస్ టికెట్‌పై వీడిన ఉత్కంఠ**

బిఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు కొలిక్కి వచ్చిన దశలో.. జనగామ రాజకీయం వేడెక్కింది. సిట్టింగ్ ఎంఎల్ఏ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డితో పాటు ఎంఎల్సిలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి జనగామ టికెట్ను ఆశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం జరగామ టికెట్ ఎవరికి ఇస్తుందో అనే ఉత్కంఠకు తెరపడింది. సిట్టింగ్ ఎంఎల్ఏ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి ఆర్టిసి ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. దీంతో ముత్తిరెడ్డి యాదిగిరి రెడ్డి ఇటీవల టిఎస్ఆర్టిసి నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మధ్య సయోధ్య కుదిర్చి జనగామ బిఆర్ఎస్ టికెట్‌ను పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఖరారు చేశారు.

# దసరాకు ఊరెళ్తున్నారా?

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన లక్కీ డ్రాకు విశేష స్పందన రావడంతో దసరాకు సైతం అదే తరహా ఏర్పాట్లు చేస్తోంది. దసరాకు 5,265 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన టీఎస్ఆర్టీసీ సంస్థ.. తమ బస్సుల్లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు నగదు బహుమతులు గెలుచుకొనే ఛాన్స్ కల్పిస్తోంది. ఈ లక్కీ డ్రా ద్వారా రూ.11 లక్షల నగదు బహుమతులను ప్రయాణికులకు అందించే అద్భుత అవకాశాన్ని అందిస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందుకోసం ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనుక తమ పూర్తి పేరు, ఫోన్ నంబర్‌ను రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలని సూచించారు. ఈ లక్కీ డ్రాలో గెలుపొందిన ప్రయాణికులకు రూ.11 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్టు సజ్జనార్ తెలిపారు. ప్రతి రీజియన్‌కు ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు చొప్పున మొత్తం 110 మందికి ఒక్కొక్కరికి రూ.9900 చొప్పున నగదు బహుమతులను ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అక్టోబర్ 21 నుంచి 23 తేదీ వరకు, మళ్లీ 28 నుంచి 30 తేదీల్లో టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారందరూ ఈ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చన్నారు. బతుకమ్మ, దసరా పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా టీఎస్ఆర్టీసీ 5,265 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బస్టాండ్లు, ప్రయాణికుల రద్దీ ప్రాంతాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా డ్రాప్ బాక్స్‌ను ఏర్పాటు చేస్తారు. లక్కీ డ్రా అనంతరం డ్రాప్ బాక్స్ను సంబంధిత ఆర్ఎం కార్యాలయాలకు చేర్చి.. ప్రతి రీజియన్ పరిధిలో లక్కీ డ్రా నిర్వహించి 10 మంది చొప్పున విజేతలను అధికారులు ఎంపికచేస్తారు. మొత్తం 11 రీజియన్లలో కలిపి 110 విజేతలను ఎంపిక చేసి వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేస్తారు. దసరా లక్కీ డ్రాకు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.

# మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, అక్టోబర్ 10 (మనం న్యూస్): బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక చెల్లదంటూ వేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు పిటిషనర్ వేసిన పిటిషన్ కొట్టివేస్తున్నట్టు న్యాయస్థానం తీర్పును వెల్లడించింది. వివరాల ప్రకారం.. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక చెల్లదంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు అనే వ్యక్తి 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిని కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అయితే, 2018లో శ్రీనివాస్ గౌడ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లో తన ఆస్తులు, అప్పుల గురించి తప్పుడు సమాచారం అందించారని రాఘవేంద్రరాజు పిటిషన్ వేశారు. ఎన్నికల అఫిడవిట్‌ను ఒకసారి రిటర్నింగ్ అధికారికి సమర్పించి.. మళ్లీ వెనక్కి తీసుకుని సవరించి అందజేశారని అందులో పేర్కొన్నారు. ఇది చట్టవిరుద్ధమని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. తీర్పులను వాయిదా వేసి మంగళవారం తీర్పును వెలువరించింది.

## ధర్మమే గెలిచింది

మహబూబ్‌నగర్, అక్టోబర్ 10 (మనం న్యూస్): ఎన్నటికైనా న్యాయం, ధర్మం గెలుస్తుందని ఈ తీర్పు ద్వారా వెల్లడైందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక చెల్లదని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టేసింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సందడి నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున మంత్రి ఇంటికి చేరుకుని పటాకులు పేల్చి మిఠాయిలు తినిపించుకుని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు నాయకులు వారి అస్తిత్వం కనుమరుగవుతుందని కుట్ర చేసి బీసీల ద్వారానే బీసీ మంత్రి నైనా నాపై కేసు వేయించారని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజల హృదయాలను గెలిచి ఓట్లు సాధించి విజయం కైవసం చేసుకోవాలి. కానీ, ఇలా అక్రమంగా కోర్టు కేసుల ద్వారా తప్పుడు మార్గంలో గెలుపు కోసం ప్రయత్నించడం దుర్మార్గం. కనీసం తాగు, సాగు నీళ్లు ఇవ్వని వారిని ప్రజలు ఛీదరించుకున్నారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని సమస్యలు తీరాయి. మహబూబ్‌నగర్ గతంలో ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక పోతున్నారు. ఒకప్పుడు వెనకబడిన జిల్లా ఇప్పుడు అభివృద్ధిలో దూసుకుపోతుంటే ఓర్వలేక ఆ ఇద్దరు ప్రధాన పార్టీల ప్రతిపక్ష నేతలు కుట్రతో కేసు వేయించారని మండిపడ్డారు. బలహీన వర్గాలకు చెందిన నాలాంటి నేతలు ప్రజలకు మంచి చేసి పేరు తెచ్చుకుంటే ఓర్వలేక కొందరు కేసుల పేరుతో దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు. గత ఐదేళ్లుగా కేసుల పేరిట సోషల్ మీడియాలోనూ దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు. జోగులాంబ అమ్మవారు, మన్యంకొండ స్వామి వాటి అశీస్సులు మాపై ఉన్నాయి. తప్పుడు ఆరోపణలు, తప్పుడు కేసులు ఎక్కువ రోజులు నిలబడవని తేటతెల్లమైందన్నారు. నాపై కుట్రలు చేసిన వారి పేర్లను ఆధారాలతో సహా వెల్లడిస్తా. వారు తప్పనిసరిగా జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు.

# 18న మేడ్చల్‌లో కేసీఆర్ బహిరంగ సభ

మేడ్చల్, అక్టోబర్ 10 (మనం న్యూస్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో అధికార పార్టీ బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ నియోజకవర్గాల్లో బహిరంగ సభలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 15నే నియోజకవర్గాల్లో బహిరంగ సభలకు శ్రీకారం చుట్టి అందులో భాగంగా ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు మేడ్చల్‌లో నిర్వహించే బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొననున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు జడ్చర్లలో సభ ముగించుకుని మేడ్చల్‌లో నిర్వహించే బహిరంగ సభకు కేసీఆర్ హాజరుకానున్నారు. మేడ్చల్ మున్సిపల్ అత్వెల్లి శివారులోని ఓ వెంచర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే విధంగా మంత్రి మల్లారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. సీఎం కేసీఆర్ హాజరయ్యే బహిరంగ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేయనున్నట్లు తెలిసింది.

## యువ కౌలు రైతు ఆత్మహత్య బాధాకరం

- కౌలు రైతు కుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలి
- మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మంథని,అక్టోబర్ 10,మనం న్యూస్ : మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నెల్లిపెల్లి గ్రామనికి చెందిన కౌలు రైతు దంపతులు కటుకు అశోక్ సంగీత యువ దంపతులు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడడం చాలా బాధాకరమని మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో గోదావరి ముంపు కు గురై కౌలుకు తీసుకొని సాగు చేసఇన 2 ఎకరాల పత్తి,3 ఎకరాల వరి పంటలు నష్టపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని వీరికి 5 సంవత్సరాల కుమారుడు 4 సంవత్సరాల కుమార్తె ఉన్నారని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మంథని నియోజకవర్గ రైతుల పాలిట శాపంలా మారిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ ఆత్మహత్య ప్రభుత్వం తప్పిదం వలనే జరిగిందని ప్రభుత్వం వెంటేనే స్పందించి ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు,సీనియర్ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాదారుల అరెస్టు

- 630 గ్రాముల గంజాయి స్వాధీనం



బెల్లంపల్లి, అక్టోబర్ 10 (మనం న్యూస్): అక్రమంగా గంజాయి రవాణా సాగిస్తోన్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం అనుమానస్పదంగా ఉన్న వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో 17 వేల రూపాయల విలువ చేసే 630 గ్రాముల డ్రై గంజాయి లభిం చింది. అనంతరం వారిని విచారించగా చెడు అలవాట్లకు, గంజాయి కి బానిసై గంజాయి తను తాగడం కోసం, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుదేశ్యంతో ఒక గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి బెల్లంపల్లి, రామగుండం ప్రాంత ంలోని అమాయకపు స్టూడెంట్స్, యువతకు ఎక్కువ ధరకు అమ్ము తానని తెలిపారు. పట్టుబడిన వారిలో మార్నె అనిల్, మందమర్రి, రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు మైనర్స్ ను పట్టుకున్నారు.

## ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన సిపి



ఇల్లందకుంట, అక్టోబర్ 10 (మనం న్యూస్): ఎన్నికల నేపద్యంలో ఇల్లందకుంట మ ండలం సిరిసేడు గ్రామ శివారులో ఏర్పాటు చేసి న ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు ఏర్పాట్లను కరీంనగర్ సిపి సుబ్బారాయుడు, హుజురాబాద్ ఎసిపి జీవన్ రెడ్డితో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కరీంనగర్ జిల్లా సరిహద్దులోని చెక్ పోస్ట్ ను పరిశీలించిన జిల్లా సిపి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవా ంఛనీయ సంఘటనలు జరుగకుండా త్వరలో సిసి కెమెరాలు ఏర్పా టు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అధి కారుల అందరితో సమ న్వయం చేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కోరే కిషోర్, జమ్మికుంట పట్టణ సీఐ బర్పటి రమేష్, ఎస్సై రాజకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధికార ప్రతినిధిగా విజయ్ సాగర్



పెద్దపల్లి, అక్టోబర్ 10 (మనంప్రతినిధి): ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధికార ప్రతినిధిగా కల్లెపల్లి సాగర్ నియమి తులయ్యారు. ఈమేరకు మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు భూషిపాక సంతోష్ మహారాజ్ నియామక పత్రాన్ని అందించారు. ఎస్సీ రిజ ర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారెడు మోహన్ ఆదేశాలకు అనుగుణంగా విజయ్ సాగర్ నియమించినట్లు తెలిపారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీల రిజర్వేషన్ దుర్వినియోగం కాకుండా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వారి హక్కులు, సంక్షేమం, సంస్కృతి, సాంప్రదాయాలు, రాజ్యాంగం ప్రసాదించిన రిజ ర్వేషన్లను కాపాడుటకు కృషి చేస్తూ జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి సంఘాలను పెద్దపల్లి జిల్లాలో విస్తరింప జేయాలని పిలుపు నిచ్చారు. భారతీయ మూల సంస్క ృతి, సాంప్రదాయాలకు పితా మహులైనటువంటి మహబలి, ఆదిజాంబవ, గౌతమబుద్ధ, పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టబ్ బాబు జగ్జీవన్‌రామ్, ఆశయా లకను గుణంగా పనిచేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్సీ రిజ ర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జూల రాకేష్, ఆరె పల్లి రాకేష్, జిల్లా నాయకులు ఇదునూరి అశోక్, వివిధ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# లక్షపై కేటీఆర్ గురి..

## రికార్డు మెజార్టీ కోసం తారకరాముని దృష్టి



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 10 (మనం న్యూస్): తెలంగాణలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసింది. వచ్చే నెల 30న ఎన్నికలు జరగనున్నాయి. దాంతో ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలపై అభ్యర్థులు పదును పెడుతున్నారు. ఈ క్రమంలోనే సిరిసిల్ల నుంచి మరోసారి పోటీ చేయబోతున్న కేటీఆర్.. ఈ సారి తన టార్గెట్ భారీగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. చాలా మంది ఎమ్మెల్యేలు మరోసారి గెలవాలని టార్గెట్‌గా పెట్టుకుంటారు. కానీ కేటీఆర్ మాత్రం లక్ష ఓట్లే టార్గెట్ అంటున్నారు. ఎందుకంటే ఆయన గెలుపు అనధికారికంగా ఖాయం అయిందని అంటు న్నాయి బీఆర్ ఎస్ వర్గాలు. ఎందుకంటే కేటీఆర్ కు అసలు పోటీ ఎవరు న్నారని అడుగుతున్నారు. అవును సిరిసిల్లలో కేటీఆర్‌కు గట్టి పోటీ ఇచ్చే నాయకుడు లేదు. ఇప్పటి వరకు కేటీఆర్ ఓటమి ఎరగకుండా గెలుస్తున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఐదోసారి రికార్డు స్థాయిలో ఓట్లు సాధించాలని అనుకుంటున్నారు. ఎలాగూగెలుస్తాం అనే నమ్మకం ఆయనకు బలంగా ఉంది. ప్రతి ఎన్నికల్లో ఆయన మెజార్టీ భారీగా పెరుగు తుందే తప్పతగ్గట్లేదు. 2014 ఎన్నికల్లో కేటీఆర్ మీద కొండూరి రవీందర్ రావు కాంగ్రెస్ పార్టీ నుంచి.. ఆకుల విజయ బీజేపీ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కేటీఆర్ కు ఏకంగా 53వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. ఆ తర్వాత కొండూరి రవీందర్ రావు బీఆర్ ఎస్‌లో చేరడంతో కాంగ్రెస్ నుంచి మళ్లీ కేకే మహేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో కేటీఆర్ మీద కేకే మహేందర్ రెడ్డి పోటీ చేసినా పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. కేటీఆర్ ఏకంగా 89వేల ఓట్ల మెజార్టీతో దుమ్ములేపే విజయం సాధి ంచారు. అప్పుడే లక్ష ఓట్ల మెజార్టీ దగ్గరి వరకు వచ్చారు. ఈ సారి దాన్ని సాధించాలని లక్ష్య ంగా పెట్టుకున్నారు. సిరిసిల్లలో 240798 మంది ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో కేటీఆర్ కు 125213 ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్ పార్టీకి కేవలం 36వేల ఓట్లు మాత్రమే పడ్డాయి. ఎన్నికలు అయిపోయినప్పటి నుంచి మహేందర్ రెడ్డి ప్రజల్లో పెద్దగా తిరిగింది లేదు. కానీ కేటీఆర్ మాత్రం ప్రతి ఊరికి, ప్రతి ఇంటికి బీఆర్ ఎస్ సంక్షేమ పథకాలను అందించడంలో కీలక పాత్ర పోషించాడు. అందుకే కేటీఆర్ అంటే చిన్న పిల్లల దగ్గరి నుంచి పండు ముసలి వారి దాకా అందరికీ తెలిసిపోయాడు. సిరిసిల్లకు రాష్ట్రంలోనే అధిక నిధులు తీసుకువచ్చాడు. డిగ్రీ కాలేజీలు, మెడికల కాలేజీలు, కేజీ టు పీజీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ లాంటివి తీసుకువచ్చారు. దాంతో పాటు కొత్తగా రోడ్లు వేయించడం దగ్గరి నుంచి మొదలు పెడితే.. అనేక సంక్షేమ పథకాలతో అటు రైతులు, ఇటు మహిళలకు లబ్ధి చేకూరేలా చూసుకున్నారు. సిరిసిల్ల ఎక్కువగా పల్లె ప్రాంతాలు, గ్రామీణ ప్రజలు ఉండే నియోజకవర్గం. అందుకే ఎక్కువగా వ్యవసాయ పథకాలను అందరికీ అందే విధంగా చూసుకున్నారు. అదే ఇప్పుడు ఆయనకు బలం కాబోతోంది. ఇన్ని రకాలుగా ఫలితాలను అందించారు కాబట్టి ఖచ్చితంగా కేటీఆర్ కు లక్ష ఓట్ల మెజార్టీ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని అంటున్నారు రాజకీయ నిపుణులు. ఇప్పటికే కేటీఆర్ కు సిరిసిల్ల టికెట్ కేటాయించారు. కానీ ఇప్పటి వరకు కాంగ్రెస్ నుంచి గానీ, బీజేపీ నుంచి గానీ ఎవరినీ కేటాయించలేదు. కాంగ్రెస్ నుంచి ఎలాగూ కేకే మహేందర్ రెడ్డికే టికెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. సిరిసిల్ల బీజేపీ అభ్యర్థిగా గత ఎన్నికల్లో మల్లుగారి నర్సాగౌడ పోటీ చేశారు. కానీ ఈ సారి ఎవరు పోటీ చేస్తారో ఇంకా తెలియదు. కానీ ఆ పార్టీ అంతగా ప్రభావం చూపించలేదు. గత ఎన్నికల్లో బీజేపీ కంటే బీఎ స్పీకి ఎక్కువ ఓట్లు వచ్చాయి. కాబట్టి బీజేపీని పెద్దగా సీరియస్ గా తీసుకునే చాన్స్ లేదు. కాబట్టి ఈ సారి కూడా బీఆర్ ఎస్ వర్సెస్ కాం గ్రెస్ అన్నట్టే ఉంటుంది పోటీ. గత ఎన్నికల మాదిరిగా ఈ సారి కూడా బీఆర్ ఎస్ ఈజీగా విక్టరీ కొట్టడం ఖాయం. కానీ ఓట్ల మెజార్టీ కేటీఆర్ అనుకున్నంత వస్తుందా రాదా అనేది చూడాలి.

# రైతుల సంఘటిత శక్తిగా ఎదగాలి

- కిసాన్ గ్రామీణ మేళా కన్వీనర్ సుగుణాకర్‌రావు




కరీంనగర్, అక్టోబర్ 10 (మనం న్యూస్):రైతుల పేదరికానికి, వెనుకబాటుకు ప్రధాన కారణం వారు సంఘటితంగా లేకపోవడమేనని, రైతులు, సహకార సంఘాలు, ఎఫ్‌పిఓలు సంఘటితమైనప్పుడే ఆర్థికంగా ఎదుగుతారని కిసాన్ గ్రామీణ మేళా కన్వీనర్ పొల్సాని సుగుణాకర్‌రావు అన్నారు. రైతులు ఐక్యంగా ఉన్నప్పుడే ప్రభుత్వాలు కూడా రైతుల సమస్యలకు ప్రాధాన్యతనిస్తాయన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణమండపంలో జరుగుతోన్న కిసాన్ గ్రామీణ మేళా కార్యక్రమం మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సుగుణాకర్‌రావు మాట్లాడుతూ రైతులు పంటలను మార్పిడి చేసి, విలువలను జోడించి వ్యాపారులుగా మారాలని, అది సహకార సంఘాలు, ఎఫ్‌పిఓల ద్వారానే సాధ్యమని తెలిపారు. రైతులు అసంఘటితంగా ఉండటం వల్లనే ప్రభుత్వాలు వారిని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యం విద్యా, వైద్య, ఉత్పత్తి రంగాలలో జరిగిన అభివృద్ధి వ్యవసాయ రంగంలో కాకపోవడమే కారణమన్నారు. 70 శాతం ప్రజలు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతంలోనే ఉన్నారని వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న కారణంగా ప్రతి సంవత్సరం 10 లక్షల మంది రైతులు వ్యవసాయాన్ని వదులుతున్నారన్నారు. కేవలం పంటలు పండించడం వరకు మాత్రమే పరిమితం అవటం వలన రైతు కష్టాలలో పడుతున్నారని పంట ఉత్పత్తులతో పాటు, పశుపోషణ, కూరగాయలు, పండ్ల తోటాలను పెంచడం లాంటి చర్యలతో రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. గతంలో ప్రభుత్వాలు వ్యవసాయ ప్రదర్శనలతో రైతులకు అనేక విషయాలపై అవగాహన కలిగించే వారిని కానీ ఇప్పుడు కిసాన్ జాగరణ్ కిసాన్ గ్రామీణ మేళా ద్వారా కొత్త పద్ధతులు యంత్రాలు పనిముట్లు, రైతులకు తెలియజేస్తున్నామని తెలిపారు. నాబార్డ్ అధికారి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నాబార్డ్ ద్వారా రైతు గ్రామీణ వృత్తులు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలతో రైతు గ్రామీణ ప్రజల ఆర్థిక శక్తికి పాటుపడుతున్నాయని తెలిపారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర డైరెక్టర్ నారాయణరావు మాట్లాడుతూ గ్రామంలోని రైతులు, వివిధ వృత్తుల వారు ఆర్థిక ఉన్నతికై కృషి చేస్తుందని కరీంనగర్లో వివిధ కులవృత్తులకు ఆర్థిక చేయూత ఇవ్వనున్నామని తెలిపారు. గ్రామీణ భారతి అధ్యక్షులు రాజా రెడ్డి గారు మాట్లాడుతూ గ్రామ అభ్యున్నతికై ప్రభుత్వాలతో పాటు సామాజిక సంస్థలకు కృషి చేయాలని గ్రామ భారతి ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. పత్తి పంట పురుగుల నివారణ పై డాక్టర్ శశిధర్ వివరించారు. ప్రభుత్వ పశు వైద్య కళాశాల డీన్ మాధవరావు పశుపోషణ గురించి వివరించారు. పశువుల ఆరోగ్య సమస్యలపై డాక్టర్ అనిత వివరించారు. వెటర్నరీ విద్యా అవకాశాల గూర్చి డాక్టర్ సంతోషిని వివరించారు. కెవికె శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు అధిక వరి పత్తి పంటల గూర్చి వివరించారు. ఉత్తమ రైతులు వెంకట్ రెడ్డి మాధవరెడ్డి గారు వారి అనుభవాలను వివరించారు. మంజీర సంస్థ ప్రతినిధి ఉదయ భాస్కర్ చేపల పెంపకం వలన కలగు లాభాలను వివరించారు. రెండవ రోజు దాదాపు పదివేల మంది రైతులకు పైగా కిసాన్ గ్రామీణ మేలని సందర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్లేశం యాదవ్, సునీల్ రావు, దుర్గ మారుతి, ఆనంద్, మొలుగూరి కిషోర్ ,లక్ష్మణ్ ,మునీర్ ఖాన్, నరసింహారెడ్డి, జితేందర్ రెడ్డి, బలరాం సింఘ్, అంజి ఉక్క అధ్యక్షులు కమలాకర్ రావు, వెంకట్ రెడ్డి, శంకరయ్య, పురుషోత్తం రావు, బాపురెడ్డి ,పరశురాములు , తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలి
- ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల కోసం 24గంటలు
- 1950 టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఏర్పాటు
- సి విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు
- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్



పెద్దపల్లి,అక్టోబర్10(మనంప్రతినిధి)భారత ఎన్నికల కమీషన్ సూచించిన నిబంధనల ప్రకారం పకడ్బందీగా జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్, డీసీపీ వైభవ్ గైక్వాడ్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ లతో కలిసి జిల్లాలో అసెంబ్లీ ఎన్నిల నిర్వ హణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమీషన్ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ నవంబర్ 3న వస్తుందని, నవంబర్ 3వ తేది నుండి నవంబర్ 10వ తేది వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందని, నవంబర్ 13వరకు నామినేషన్లు స్క్రూటీనీ, నవంబర్ 15వ తేది వరకు నామినేషన్లు ఉపసంహరణ గడువు ఉంటుందని, నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో 2వ ఓటరు జాబితా సవరణ తుది ఓటరు జాబితా ప్రకారం 6లక్షల 94వేల 612 మంది ఓటర్లు ఉన్నారని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరులేని వారు అక్టోబర్ 30వరకు ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 837పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్‌కు రెండు కిలోమీటర్లు రేడియస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల కమీషన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని అన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. రాజ కీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగి ంచడానికి వీలులేదని అన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చీలు, ప్రార్థనస్థలాలలో పోలింగ్ కేంద్రాలకు 100మీటర్ల పరిధిలో నిర్వహించరాదని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియ మావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో 10 సర్వేలెన్స్ బృందాలను, 10ప్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, 5వీడియో సర్వేలెన్స్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా, సి-విజల్ యాప్ ద్వారా చేయ వచ్చని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరించేందుకు 24గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సీ-విజల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాల యాలలో 24గంటల వ్యవధిలో, బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ ప్లేస్‌లలో 48గంటల వ్యవధిలో, అనుమతిలేని ప్రైవేట్ స్థలాలలో 72గంటల వ్యవదిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డీసీపీ వైభవ్ గైక్వాడ్ మాట్లాడుతూ అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, 24గంటల పాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసకుంటామని పేర్కొన్నారు. ఈసమావేశంలో సిసెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, డిప్యూటి తహాశీల్దార్ ప్రవీణ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ఎన్నికల ఏర్పాట్లు చేపట్టాలి

- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సీతారామయ్య



మంచిర్యాల, అక్టోబర్ 10 (మనం న్యూస్): ఆర్‌ఎల్ సి సమక్షంలో నామి నేషన్లు వేసిన ట్రేడ్ యూనియన్లకు మంగళవారం రోజున గుర్తులను కేటాయించినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూని యన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసి రెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ కుమారులు తెలిపారు. గుర్తుల కేటాయింపు జరి గింది కనుక సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ఎన్నికలకు కావలసిన యంత్రాంగాన్ని కేటాయించాలని డిమాండ్ చేసారు. ఎన్నికల వాయిదా కొరకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం, యాజమాన్యం, ప్రభుత్వం శతవిధాలుగా కుట్రలతో కుతంత్రాలతో కోర్టులను కూడా మేనేజ్ చేస్తూ తప్పుడు సమాచారం ఇస్తూ ముందుకు వెళ్తున్నాయని ఆరో పించారు. ప్రస్తుతం జనరల్ ఎలక్షన్ కొరకు నోటిఫికేషన్ వచ్చింది గనుక ఎన్నికలు వాయి దాకు మాత్రమే ఈ సెక్షన్లు ముందుకు వస్తాయన్నారు. జనరల్ ఎన్ని కల ప్రక్రియ నవంబర్‌లో ఉంది కనుక అక్టోబర్ 28న ట్రేడ్ యూనియన్ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో ఈలోపు ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకం ఉందన్నారు. అందు వల్ల యాజమాన్య ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఎన్నికలు జరుపడానికి ముందుకురావాలన్నారు. లేకుంటే కోల్ బెల్ట్ ప్రాంతంలో ఒక్క సీటును కూడా సింగరేణి గని కార్మికులు గెలువనీయకుండా ముందుకు వెళ్తారని పేర్కొన్నారు.

## మూఢనమ్మకాలు విడనాడాలి



రామకృష్ణాపూర్, అక్టోబర్ 10 (మనం న్యూస్): సమాజంలో భూత వైద్యం, చేతబడులు లాంటి మూడనమ్మకాలను విడనాడాలని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షులు, అడ్వకేట్ మోతె రాజలింగు అన్నారు. మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రస్తుత సమాజంలో ఉన్న మానసిక రోగులకు సరైన చికిత్సను అందించే బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. మూఢనమ్మకాలు, మూఢాచారాలు, భూతవైద్యం లాంటి వాటిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొల గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో రైట్ టు హెల్త్ ఫోరం పట్టణ అధ్యక్షులు పోతుల మురళీకృష్ణ, సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



రామకృష్ణాపూర్, అక్టోబర్ 10 (మనం న్యూస్): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు మల్లికార్జున్ నగర్‌కు చెందిన రమణమ్మ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బిఆర్‌ఎస్ పట్టణ ఇంచార్జ్ గాండ్ల సమ్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రేవెల్లి ఓదెలు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు జిలకర రాయమల్లు, బిఆర్‌ఎస్ నాయకులు రాజబద్రి, మల్లికార్జున్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వైజ్ఞానిక సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



హుజురాబాద్ టౌన్, అక్టోబర్ 10, (మనం న్యూస్): డిటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించనున్న విద్యా వైజ్ఞానిక సదస్సు పోస్టర్‌ను మంగళవారం డిటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మండల విద్యాధికారి కేతిరి వెంకట నరసింహారెడ్డి, డిటిఎఫ్ మండల అధ్యక్షులు శ్రీరామ్ చక్రధర్, నాయకులు శ్రీనివాస్, రమేష్, సాంబమూర్తి, కాలేరు శశికళ, తిరుణహరి రాజశ్రీ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులకు సహకరించాలి

- సిఐ కృష్ణ




లక్షెట్టిపేట్, అక్టోబర్ 10, (మనం న్యూస్ ): ఎన్నికల వేళ శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులకు సహకరించాలని సిఐ కృష్ణ ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని చందారం గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు సంఘాల సభ్యులు, యువకులు,గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి పార్టీ గురించి ఏలాంటి విభేదాలు తలెత్తకుండా ప్రచారం చేసుకోవాలన్నారు. ఎలాంటి అల్లర్లు జరిగిన కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లాఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిభంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. గ్రామంలోఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికలు కోడ్ నేపథ్యంలో పోలీస్ కేసులు నమోదు అయితే శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట ఎస్సై లక్ష్మన్, ఏఎస్ఐ రాజయ్య, హెడ్ కానిస్టేబుల్ సుభాష్, ఎంపీపీ అన్నం మంగ చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ అనుమాల్ల పద్మ, నాయకులు రవీంద్రావు, వినోద్ తో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పురుమల్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



కొత్తపల్లి, అక్టోబర్ 10, (మనం న్యూస్): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన అభిమానులు, గ్రామస్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినం సందర్భంగా కార్యకర్తలు, అభిమానులతో బొమ్మకల్‌లోని ఆయన నివాసం కిక్కిరిసింది. ఉదయం నుండి కార్యకర్తలు, అభిమానులు, వివిధ యువజన సంఘాల నాయకులు ప్రతినిధులు సభ్యులు పెద్ద ఎత్తున శ్రీనివాస్ నివాసానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవలే శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీ కార్యకర్తలు, ఎన్ఎస్‌యుఐ నాయకులు కరీంనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా పలుచోట్ల జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## బెల్ట్ షాప్ నిర్వాహకుల బైండోవర్



తిమ్మాపూర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని బెల్ట్ షాపుల నిర్వాహ కులను మంగళవారం ఎక్సైజ్ శాఖ పోలీసులు తహశిల్దార్ కె. కనక య్యా ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ దృష్ట్యా బెల్ట్ షాప్ నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వారికి రెండు లక్షల జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్సైలు శ్రీకాంత్, సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, అక్టోబర్ 10, (మనం న్యూస్): 40 నుంచి 45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి బిజిగిరిషరీఫ్–పోత్కపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై పడి మృతి చెందినట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు సంపర్క్ క్రాంతి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. రైలు కింద పడ్డ కారణంగా శరీరం నుజ్జునుజ్జయి గుర్తించడానికి వీలు లేకుండా ఉందని, మృతుని వద్ద ఎలాంటి గుర్తింపుకార్డులు లేవని పేర్కొన్నారు. మృతుడు నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నట్లు తిరుపతి తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెంబర్ 99493 04574, 87126 58604 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల అర్బన్, అక్టోబర్ 10, (మనం న్యూస్)ఫ తెలంగాణ శాసన సభకు సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి కోరారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలంటే ఎవరూ ఆందోళన చెందవద్దని, నామినేషన్ల స్వీకరణకు 10 రోజుల ముందు వరకు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. తుది ఓటరు జాబితాలో ఎవరిదైనా ఓటు హక్కు లేకపోతే సంబంధిత బూత్ లెవెల్ ఎలక్టోరోల్ ఏజెంట్ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సి-విజిల్, 1950 నెంబర్, ఎన్జీఆర్ఎస్ కు వచ్చే ఫిర్యాదులకు సత్వర స్పందన అందిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద సువిధ కేంద్రం ఉంటుందని, ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ ద్వారా ఎన్నికల ప్రచారాలకు, ర్యాలీలకు, బహిరంగ సభలు, తదితర వాటి కోసం అనుమతి తీసుకోవచ్చని తెలిపారు. వీటి అనుమతి కోసం 48 గంటల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గమనించాలని సూచించారు. సంబంధిత రిటర్నింగ్ అధికారులు కూడా తమ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మీటింగ్ పెట్టాలని అన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రభావితం చేసేవిధంగా, ప్రలోభపెట్టే విధంగా చేస్తే సీ విజిల్ అప్లికేషన్‌లో కంప్లైంట్ ఇవ్వచ్చని, 100 నిమిషాల్లో కంప్లైంట్‌ను పరిశీలించి, వెరిఫై చేసి పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు. ఫస్ట్ లెవెల్ చెకప్‌కు ఉపయోగించిన ఈవీఎం మెషీన్ ల జాబితా, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ర్యాండమైజేషన్ అయ్యే ఈవీఎం ల జాబితా ప్రతినిదులకు సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రజలను ప్రలోభపెట్టే విధంగా, ప్రభావితం చేసే విధంగా పోస్టులు పెట్టకూడదని, అలా చేస్తే సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్ లపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యంత్రాంగం సోషల్ మీడియా మీద ప్రత్యేక నిఘా పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో తాత్కాలికంగా పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటే ముందుగా అనుమతి తీసుకోవాలని అన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆన్ లైన్‌లో లేదా నేరుగా కార్యాలయంలో ఇవ్వవచ్చని తెలిపారు.

## జర్నలిస్టుల నివేషణా స్థలాల కేటాయింపులో అన్ని అక్రమాలే

- అనర్హులకు జారీ చేసిన పట్టాలు రద్దు చేయాలి
- నివేషణ స్థలాల కేటాయింపు వ్యవహారంపై విచారణ జరిపించాలి
- కలెక్టర్‌కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఫిర్యాదు



కరీంనగర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): జర్నలిస్టుల పేరిట కరీంనగర్‌లో పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూమ్ పట్టాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకున్నాయని, అనేక అక్రమాలు జరిగాయని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆరోపించింది. తక్షణమే దీనిపై విచారణ జరిపి అనర్హులకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ పట్టాలను రద్దు చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. పౌరసరఫరాల శాఖలో తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తి, అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న జర్నలిస్టు సంఘానికి జిల్లా నేతగా చలామణి అవుతూ, బిసి సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి వద్ద వ్యక్తిగత సహాయకునిగా పనిచేస్తూ, అంగట్లో సరుకులా అమ్ముకున్నారని సంఘం నేతలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మంత్రి, నగర మేయర్ వద్ద పిఆర్‌ఓలుగా పని చేస్తున్న వ్యక్తులకు జర్నలిస్టుల కోటాలో నివేశన స్థలాలు కట్టబెట్టడం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. జర్నలిజంలో దశాబ్దకాలం, ఆపై అనుభవం ఉన్న వారి పేర్లను, తమకు అనుకూలంగా లేరనే సాకుతో పక్కన పెట్టించిన మంత్రి, గతంలో నివేశన స్థలాలు పొందిన తన వారికి మాత్రం మరోసారి నివేశన స్థలం కేటాయించడం చూస్తే, జరిగిన అక్రమాల్లో మంత్రి ప్రమేయం స్పష్టంగా ఉందని అర్థం అవుతుందన్నారు. అక్రమాలకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని అందజేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని యూనియన్ ప్రతినిధి బృందం కలెక్టర్ కు తెలియజేసింది. దీనిపై తక్షణం చర్య తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర గవర్నర్ కు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం

- అవినీతి రహిత పాలనే ఫార్వర్డ్ బ్లాక్ లక్ష్యం
- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోజిరెడ్డి





కరీంనగర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓట్లు, సీట్ల రాజకీయాలే తప్ప అభివృద్ధి, సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశాయని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజి రెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అవినీతి రహిత పాలనే ధ్యేయంగా నేతాజీ స్థాపించిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో119 స్థానాల్లో పోటీ చేయబోతున్నామని, మూడు పార్టీలకు గట్టి పోటీ ఇస్తామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో మూడు పార్టీలకు అవకాశం ఇచ్చారని, నేతాజీ ఆశయాలతో ముందుకు వస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. అవినీతి రహిత పాలన అందించడమే కాదు అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. గెలిచిన మూడేళ్ళలో అభివృద్ధి చూపించక పోతే పదవులకు రాజీనామా చేయడానికైనా సిద్ధమేనన్నారు. డబ్బులు వెదజల్లే పార్టీ తమది కాదని, మా పార్టీ ఆశయాలను, లక్ష్యాలను ఆయువుగా చేసుకొని నడిపిస్తున్న పార్టీ కి ఒక్క ఛాన్స్ ఇచ్చి చూడాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమ అభ్యర్థులను మేనిఫెస్టో లను నాలుగు రోజుల్లో ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ప్రగతిశీల, అభ్యుదయ, మేధావులు, యువతి, యువకులు పాలక ప్రభుత్వాల దోపిడీని, కుటిల రాజకియాలను కూకటివేళ్లతో పెగిలించాలన్నారు. మాకెందుకులే అని యువత చూస్తూ పోతే భవిష్యత్ తరాలకు పెను ప్రమాదం జరుగుతుందన్నారు. 2018లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మళ్లీ ప్రజల ముందుకు వస్తున్న బూర్జువా రాజకీయ పార్టీలను తరిమికొట్టాలని జోజిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఏమ్మెల్యే అభ్యర్థి ముత్యాల విజయ్ కుమార్, పెద్దేళ్ళి శేఖర్, కరీంనగర్ జిల్లా నాయకులు పులిమాటి సంతోష్ కుమార్, శంకర్ కురవెల్లి టియుసిసి జిల్లా కన్వీనర్ , గొల్లపల్లి ప్రశాంత్ కుమార్ ఎఐవైఎల్ ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం



తిమ్మాపూర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని చల్మెడ ఆనందరావు హస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజమౌళి, సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్‌తో పాటు వైద్య బృందంలోని సభ్యులు మాట్లాడుతూ శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్క పౌరుడి భాధ్యత అని తెలిపారు. అనంతరం వివిధ కార్యక్రమాల ద్వారా మానసిక ఆరోగ్యం కాపాడుకోవడానికి విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు, అలవాట్లను వివరించారు. ఈ సందర్భంగా వాగేశ్వరి కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆరోగ్యపు సూత్రాలు, సూచనలు పాటిస్తూ సమాజానికి అవగాహన కల్పించే విధంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు సిహెచ్. ప్రకాశ్ రెడ్డి, వి.వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ డి. శ్రవణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతి శిశు మందిర్‌కు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి విరాళం



జమ్మికుంట, అక్టోబర్ 10, (మనం న్యూస్): స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ స్వర్ణోత్సవాల సందర్భంగా జమ్మికుంట పట్టణానికి చెందిన నేత్ర వైద్య నిపుణులు, ఆవాస విద్యాలయం సమితి అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం 25 వేల రూపాయల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1973లో స్థాపించిన శ్రీ సరస్వతి శిశు మందిర్ గత యాభై ఏళ్లగా విద్యారంగ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిందని, వేలాది మంది విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్ది, సమాజానికి అందించిందన్నారు. గత నలభై ఏళ్లుగా తనకు పాఠశాలకు అనుబంధముందని, ఈ పాఠశాలకు గత పది సంవత్సరాలుగా ప్రబంధకారిణీ కార్యదర్శిగా సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## రూ. ఐదున్నర లక్షల నగదు స్వాధీనం

నస్పూర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): నస్పూర్ మున్సిపాలిటి పరిధి లోని సిసిసి నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 5లక్షల 50వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనలు తనిఖీ చేస్తుండగా మునగంట కార్తీక్ వద్ద 5లక్షల50వేల రూపాయలు నస్పూర్ నుంచి మంచిర్యాలకు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నారని తెలిపారు. లభించిన రూపాయలకు సరైన ఆధారాలను చూపకపోవడంతో ఆ డబ్బును సీజ్ చేసి తదుపరి విచారణ కోసం ఎఫ్ఎస్టీ టీంకి అప్పగించినట్లు వివరించారు.

## హుజురాబాద్ కాంగ్రెస్ టికెట్ డాక్టర్ బల్మూరి వెంకట్‌కే ఇవ్వాలి



హుజురాబాద్, అక్టోబర్ 10, (మనం న్యూస్): హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బల్మూరి వెంకట్ కు కేటాయించాలని హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సొల్లు బాబు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం బల్మూరు వెంకట్ కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువైందన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ వెంకట్ కేటాయించడం వల్ల హుజురాబాద్‌లో విజయం సాధించవచ్చన్నారు.

## రేణిగుంట చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన సిపి



తిమ్మాపూర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్ ప్లాజా సమీపంలో చెక్ పోస్ట్‌ను మంగళవారం కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు పరిశీలించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో మనకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేయగా పరిశీలించిన అనంతరం ఎల్ ఎండి ఎస్సై ప్రమోద్ రెడ్డితో పాటు అక్కడున్న సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిపి సుబ్బారాయుడు మాట్లాడుతూ తనిఖీల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు, ఓటర్లను ప్రభావితం చేసేవి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో తిమ్మాపూర్ సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై ప్రమోద్ రెడ్డి లతో పాటు పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## మత్స్య పారిశ్రామిక సంఘ అధ్యక్షులుగా శ్రీనివాస్



చిగురుమామిడి, అక్టోబర్ 10, (మనం న్యూస్): మండలంలోని ఇందుర్తి మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులుగా గట్టు శ్రీనివాస్ ఎన్నికైనారు. మంగళవారం సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షులుగా గట్టు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బొల్లి రాజయ్య, కార్యదర్శిగా కూన ముత్తయ్య, డైరెక్టర్లుగా బరిగేల లక్ష్మణ్, గట్టు బాబు, కోన సంపత్ కుమార్, కన్నం కనకయ్య, కూన వెంకటేశం, కూన బాలయ్యలు గెలుపొందినట్లు ఎన్నికల అధికారి కర్ణన్ కుమార్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని స్థానిక జడ్పిటిసి సభ్యులు, జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్ ముదిరాజ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు వెంకటస్వామి, ప్రశాంత్, రంజిత్, బుల్లి శ్రీనివాస్, ఎర్రోళ్ల పోచయ్య బరిగెల కనకయ్య, శ్రీనివాస్ రాజయ్య, సమ్మయ్య రాజేశం, బొల్లి మల్లేశం, ఆంజనేయులు, రాజయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుబడ్డ విద్యుత్ మోటార్ల దొంగలు

- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



నేలకొండపల్లి రూరల్, అక్టోబర్ 10, (మనం న్యూస్) : గత కొంతకాలంగా నేలకొండపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ మోటార్ల దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను రైతులు, గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం మండలంలోని ఆరెగూడెం గ్రామంలో జరిగింది. మండలంలోని రాజేశ్వరపురం, చెన్నారం, బోదులబండ, కోరట్లగూడెం, కూసుమంచి మండలం మల్లేపల్లి తదితర గ్రామాలలో గత ఏడాదిక్రితం నుండి రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడం స్థానిక పోలీస్ స్టేషన్లో రైతులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అదే క్రమంలో సోమవారం రాత్రి మండలంలోని ఆరెగూడెం గ్రామంలో స్థానిక కాలువ కట్టలపై, పొలాల వద్ద అమర్చిన వ్యవసాయ విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు దొంగిలిస్తున్న విషయం తెలుసుకున్న రైతులు వారిని పట్టుకుని గ్రామపంచాయతీలో బంధించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో వాహన తనిఖీలు



తిరుమలాయపాలెం, అక్టోబర్ 10, (మనం న్యూస్) : కేంద్రం ఎన్నికల సంఘం ఎలక్షన్ కోడ్ ప్రకటించిన నేపథ్యంలో తిరుమలాయపాలెం ఎస్ఐ వరాల శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. ఖమ్మం వరంగల్ ప్రధాన రహదారిపై వచ్చే ప్రతి వాహనాన్ని ఖమ్మం వరంగల్ ప్రధాన రహదారిపై దమ్మాయి గూడెం సమీపంలో ఆయన పరిశీలించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వరాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎల్.వెంకటేశ్వర్లు, మల్సూర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అరూరికి మద్దతుగా కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానాలు

- అభివృద్ధికి అండగా వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు
- ఎమ్మెల్యే అరూరికి మద్దతుగా పర్వతగిరి మండల మున్నూరుకాపు సంఘం ఏకగ్రీవ తీర్మానం



పర్వతగిరి, అక్టోబర్ 10, (మనం న్యూస్) : మండల మున్నూరుకాపు కుల సంఘం ఎమ్మెల్యే అరురికి పూర్తి మద్దతు ప్ర కటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ని హన్మకొండ ప్రశాంత్ నగర్లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మూడోసారి కూడా మా ఎమ్మెల్యేని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజా సం క్షేమమే లక్ష్యంగా మన ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుండి నేటి వరకు రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షే మ పథకాలే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి వర్ధన్నపేట నియోజకవర్గ అ భివృద్ధే ప్రధాన లక్ష్యంగా అహర్నిశలు పాటుపడుతున్నాని తెలి పారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు పార్టీ కోసం పని చేసే కా ర్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నానని తెలి పారు. ప్రతీ రోజు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉం టూ వారి కష్ట సుఖాలలో పలుపంచుకుంటూ వారికీ అండగా నిలుస్తున్నానని తెలిపారు. తనను నమ్మి వచ్చిన ప్రతీ కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్, పర్వ తగిరి సర్పంచ్ చింతపట్ల మాలతీ సోమేశ్వర్ రావు, ఎంపిటిసి మాడుగుల రాజు, ఉప సర్పంచ్ రంగు జనార్ధన్, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు డాక్టర్ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి బైరు రాజు, ఉపాధ్యక్షులు బుక్క కుమారస్వామి, కోశాధికారి బక్కి రాజు, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, గొల్లం రవి, బక్కి సంజీవ, బక్కి శ్రీనివాస్, పిట్టల రంజిత్, బక్కి యాకయ్య తదితరులు ఉన్నారు.

# ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులు దూకుడు

- నియోజకవర్గాల్లో నిత్యం ప్రచారహోరు
- మరోమారు ఆశీర్వదించాలని వినతి



కరీంనగర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బిఆర్ఎస్ అభ్యర్థులు దూకుడు పెంచారు. తమ నియోజకవర్గాల్లో నిత్యం ప్రచారహోరుతో సాగుతున్నారు. మరోమారు ఆశీర్వదించాలని కోరుతున్నారు. కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పీడ్ పెంచారు. తన తండ్రి, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి ఇప్పటికే అన్ని గ్రామాల్లో పర్యటించారు. చేసిన అభివృద్ధి పనులు చెప్పడమేకాదు, భవిష్యత్‌లో తాను చేపట్టబోయే పనుల గురించి చెబుతున్నారు. యువకుడిగా, విద్యావంతుడిగా, డాక్టర్‌గా తనను గెలిపిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. యువకుడిగా, వైద్యుడిగా మంచి పేరు తెచ్చుకున్న కల్వకుంట్ల సంజయ్‌ను గెలిపించేందుకు ప్రజలు కలిసి కదులుతున్నారని ప్రచారం చేస్తున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఊరువాడా అన్న తేడా లేకుండా కలియ తిరుగుతున్నారు. నియోజకవర్గంలో మొదటి దఫా ప్రచారాన్ని పూర్తి చేశారు. గతంలోనూ ఒకప్పుడు కరువుకు కేరాఫ్‌గా నిలిచిన హుస్నాబాద్, ఇప్పుడు ఎలా మారిందో..? ఎలా అభివృద్ధి జరిగిందో కండ్లకు కట్టినట్లుగా ప్రజలకు వివరిస్తున్నారు. దీంతోపాటు సతీశ్‌కుమార్‌కు సబ్బండ వర్గాలు అండగా నిలుస్తూ ఆశీర్వాదాలు అందిస్తున్నాయి. మద్దతు తెలుపుతూ పలు సంఘాలు ఏకగ్రీవ తీర్మానాలు చేయగా, ఈ సారి గెలుపుఖాయమనే ధీమా వ్యక్తమవుతున్నది. చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన సైతం అన్ని గ్రామాలను కలియ తిరిగారు నిత్యం ప్రజల్లో ఉంటూ వారితో మమేకమవు తూనే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో సమకూరిన సాగునీరు, తద్వారా పెరిగిన సాగు, వాటి ద్వారా రైతులు పొందుతున్న లబ్ధివంటి అంశాలను వివరిస్తూ ముందుకుసాగుతున్నారు. జరిగిన అభివృద్ధిని కండ్లారా చూస్తున్న ప్రజలు, సుంకె రవిశంకర్‌ను గెలిపించేందుకు రెడీ అయిపోయారు. జగిత్యాల ఎమ్మెల్యే, అభ్యర్థి డాక్టర్ మాకునూరు సంజయ్‌కుమార్, ఇప్పటికే అన్ని గ్రామాల్లో కలియ తిరిగారు. గ్రామాల వారీగా కుల సంఘాలతో సమావేశాలు పెడుతూ, చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూనే, మరోవైపు రాబోయే ఐదేండ్లలో తాను చేసే అభివృద్ధి గురించి చెబుతున్నారు. జగిత్యాల మాస్టర్ ప్లాన్ విషయంలో రైతుల భూములు పోకుండా చూసే విషయంలో మంత్రి కేటీఆర్ ద్వారా హామీ తీసుకోవడంలో ఆయన సక్సెస్ సాధించారు. దీంతోపాటు పెద్ద మొత్తంలో డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రారంభించడంతోపాటు సంజయ్ స్వయంగా వైద్య వృత్తి ద్వారా అందిస్తున్న సేవలు బాగా కలిసి వస్తున్నాయి. ఇటీవల జగిత్యాలలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న సభకు జనం తండోప తండాలుగా తరలివచ్చారు. ఇక్కడ మంత్రి కేటీఆర్ ప్రతి అంశాన్ని విడమరిచి చెప్పారు. సంజయ్‌కుమార్‌ను గెలిపిస్తే భవిష్యతో ఎలా ఉంటుందన్న విషయాన్ని విప్పి చెప్పిన తీరు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నది. భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు రెడీ అవుతున్నారు. మంథని నియోజకవర్గ అభ్యర్థి, ప్రస్తుత పెద్దపల్లి జడ్పీ ఛైర్మన్‌పుట్ట మధు విస్తృతంగా పర్యటిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆయన పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రకు అడుగడుగునా అనూహ్య స్పందన వచ్చింది. గత ఎన్నికల్లో ఓటమి పాలైనా, ఇప్పుడు జడ్పీ ఛైర్మన్‌గా నియోజకవర్గ అభివృద్ధి కోసమే పాటుపడుతున్నట్లు చెప్పారు. పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థి మనోహర్‌రెడ్డి తన దైన శైలిలో ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇప్పటికే గ్రామగ్రామాన తిరిగిన ఆయన, అభివృద్ధి పనులకు ప్రారంభోత్స వాలు చేస్తూ ప్రచారం చేస్తున్నారు. తాజాగా మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి సభ గ్రాండ్‌సక్సెస్ అయింది. జనం భారీగా తరలి రావడంతోపాటు సభలో మంచి స్పందన కనిపించింది. తిరిగి మిగిలిన ప్రాంతాల్లోనూ బహిరంగ సభలు పెట్టేందుకు ఆయన ఎలాన్ చేస్తున్నారు. అంతేకాదు, ఇటీవల మంత్రి కేటీఆర్ నియోజకవర్గంపై వరాలు జల్లుకురిపించడంతో ప్రజల్లో మంచి స్పందన రాగా, బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు అడుగులు వేస్తున్నారు. మానకొండూర్ నియోజకవర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రచారంలో ముందున్నారు. పొద్దుపొడువక ముందే గ్రామాల్లో ఉండి సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా ప్రజలకు అందిస్తున్న ఆయన, ఇప్పుడే కూడా అదే పంథాలో ముందుకు సాగుతున్నారు. అందరికంటే ముందుగానే శంకరపట్నం మండలంలో యువగర్జన నిర్వహించి.. ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే దాదాపు అన్ని మండలాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. తాజాగా ఇల్లంతకుంట మండలంలో జరిగిన సభకు ముఖ్య అతిథిగా హరీశ్‌రావు వచ్చారు. రసమయి గురించి చెప్పిన మాటలు, అభివృద్ధిలో సాధించిన విజయాల గురించి వివరించిన తీరు ప్రజలను ఆకట్టుకున్నాయి. హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రచారంలో ముందున్నారు. ప్రతి పథకం కింద ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ ఫలాలను ఆయనే నేరుగా లబ్ధిదారులకు ఇండ్లకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఇదే సమయంలో, ఒక ఎమ్మెల్సీగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే, భవిష్యత్‌లో హుజూరాబాద్ ఎలా అభివృద్ధి చేస్తారో..? చెబుతున్నారు. రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థి కోరుకంటి చందర్ ప్రచారంలో జోరు పెంచారు. ఇక్కడ బీజేపీలో కీలక నేత కౌశిక్‌హరి బీఆర్ఎస్‌లో చేరడంతోపాటు ఇతర పార్టీల్లోని పలువురు కార్పొరేటర్లు కారెక్కడంతో పార్టీకి మంచి ఊపు వచ్చింది. దీనికితోడు సింగరేణిలో ఇండ్ల పట్టాల సమస్య పరిష్కరించడంలో చందర్ పెద్ద విజయం సాధించారు. వేములవాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఎమ్మెల్యేగా తొలిసారి ఈ నియోజవర్గం నుంచి పోటీచేస్తున్నా, ఆయన సొంత నియోజకవర్గం కావడంతో పూర్తి పట్టు ఉన్నది. అలాగే ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెలే చెన్నమనేని రమేశ్ బాబుతో కలిసి ప్రచార జోరు పెంచారు. తాను గెలిస్తే భవిష్యత్‌లో నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంటుందో..? వివరిస్తున్నారు. ఇప్పటికే ఊరూరా రెండో దఫా ప్రచారాన్ని ప్రారంభించారు.

## 14 నుండి శ్రీ దుర్గాభవానీ శరన్నవరాత్రోత్సవాలు

- నవరాత్రుల కరపత్రాలను ఆవిష్కరణ



కరీంనగర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): త్రిమూర్తులకు శక్తి ప్రధాత, త్రిలోకేశ్వరి సకలాభీష్ట ప్రదాయిని శ్రీదుర్గాభవానీ శరన్నవరాత్రోత్సవాలు ఈనెల 14 శనివారం నుండి కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత శ్రీ దుర్గాభవానీ దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ తెలిపారు. మంగళవారం శరన్నవరాత్రులకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నవరాత్రోత్సవాల కార్యక్రమాల గురించి వివరించారు. నవరాత్రులలో భాగంగా 14వ తేదీన ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి విశేష ద్రవ్య ఫలపంచామృత మహాభిషేకాలు, విశేష హారతులు, ధ్వజారోహణతో ఉత్సవాలు ఆరంభమై 15వ తేది ఆదివారం ఉదయం 6.30 గంటలకు గురువందనం, గోపూజ, పుణ్యాహవాచనం, గ్రహారాధన, కలశస్థాపన, చండీపారాయణ చతుష్షష్ట్యుపచారపూజ, చండీహోమం, మంగళ హారతి, కన్యాసువాసినీ పూజలు జరుగుతాయని తెలిపారు. ఆమ్మవారు బ్రహ్మీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని సాయంత్రం బతుకమ్మ పల్లకీ సేవ, కోలాటం, రాజోపచార పూజలు జరుపనున్నట్లు ఆయన తెలిపారు. 16న మహేశ్వరీ అలంకరణలో నంది వాహనంతో, 17న కౌమరీ అలంకరణలో నెమిలి వాహనంతో, 18న వైష్ణవీ అలంకరణలో గరుడ వాహనంతో, 19న లలిత త్రిపురసుందరిగా, 20న సరస్వతీ అలంకరణలో హంస వాహనంతో, 21న అన్నపూర్ణ అలంకరణలో, 22న దుర్గా అలంకరణలో సింహావాహనంతో, 23న విజయలక్ష్మి అలంకరణలో గజవాహనంతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. చండీహోమం మహాపూర్ణాహుతి , సాయంత్రం దసరా వేడుకలు, జమ్మిపూజ, రాంలీల జరుగుతుందని ఆయన వివరించారు. 24 మంగళవారం అర్ధనారీశ్వర అలంకరణలో నంది, సింహ వాహనలతో అమ్మవారు దర్శనమిస్తారని, సాయంత్రం 4గంటలకు సందరేశ్వరుల దుర్గాభవానీల పట్టాభిషేకం, రథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు. నవరాత్రులలో ప్రతి రోజు ఉదయం చండీహోమం, శ్రీచక్రపూజ, చతుష్షష్ట్యుపచార పూజ, విశేష హారతి, పూర్ణాహుతి, కుంకుమార్చనలు, చండీపారాయణం, సహస్ర నామార్చన తదితర పూజలు జరుగుతాయని ఈ ఉత్సావాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. కరపత్రాల ఆవిష్కరణలో ఆలయ ఫౌండర్ ఛైర్మెన్ వంగళ లక్ష్మన్, కమిటి సభ్యులు ముక్క ప్రభాకర్, నీరుమల్ల తిరుపతి, శానగొండ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి బోయ కులస్థులను వంచిస్తున్న రాజకీయ పార్టీలు

ఎలిగేడు,అక్టోబర్ 10, (మనం న్యూస్) : ఎలిగేడు మండల కేంద్రంలోని వాల్మీకి బోయ కమ్యూనిటీ హాల్‌లో కులస్తులందరం సమావేశంలో పెద్దపల్లి జిల్లా వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు గుడుగుల మహేందర్ మాట్లాడుతూ 30 దశాబ్దాలుగా వాల్మీకి బోయస్తులను రాజకీయ పార్టీలు మోసం చేస్తూనే గడుపుతున్నారు. ఎలక్షన్లు వస్తేనే వాల్మీకిలను ఎస్టీ జాబితాలో పునర్ధిస్తామని వాల్మీకి బోయలకు న్యాయం చేస్తామని ప్రగాలు పలుకుతున్నారు. ఎలక్షన్లు అయిపోయిన తధానంతరం పట్టించుకున్న పాపాన పోలేదు రామాయణం రాసినటువంటి ఆదికని వాల్మీకి వంశం చెందిన మాకు ఈ సమాజంలో సరైన గుర్తింపు లేదు మా జన్మ హక్కు అయిన వాల్మీకి బోయ ఎస్టీ పునర్ధన మా తాతా ముత్తాతల నుండి పోరాటాలు చేస్తూనే వస్తున్నాం రాజకీయ పార్టీలు పార్టీ మేనిఫెస్టో పెట్టి కాలయాపన చేస్తూ మోసగిస్తూనే వస్తున్నారు. ఐక్య కార్యాచరణ జెంట్ యాక్షన్ కమిటీ తీర్మానం మేరకు రాబోయే కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మా కులస్థులను ఏకతాటిపై తీసుకువచ్చి ఓటు అనే ఆయుధంతో జవాబు చెప్తాం ఏ రాజకీయ పార్టీ అయితే మా వాల్మీకి బోయ కులస్థులు ఏ జిల్లాలో అధికంగా ఉన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్‌లో కనీసం రెండు ఎమ్మెల్యే సీట్లు అయినా మా కులస్థులకు ఇస్తే మా హక్కుల కోసం వారు పోరాటాలు చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మా కులస్థులు అందరూ ఆ పార్టీకి అండదండలు అందిస్తామని డిమాండ్ చేశారు.



### ఎలిగేడు వాల్మీకి బోయ కుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా ముత్యాల మల్లేశం, ఉపాధ్యక్షులు భోగి శ్రీనివాస్, కుడు దల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా భోగి సతీష్, సహాయ కార్యదర్శిగా కుడుదుల నరేష్, క్యాషియర్‌గా బలంతుల ఎల్లయ్య,కార్యవర్ సభ్యులుగా బలవంతుల కొండయ్య, కింగర్ల అంజయ్య,గుజ్జుల నంబయ్య, గుజ్జుల సది, ముతికిల లచ్చయ్య, బలంతుల రంగయ్య, ఇట్టి కమిటీని బుక్కల సా రయ్య, మాజీ అధ్యక్షుడు మరియు జిల్లా అధ్యక్షుడు గుడుగుల మహేందా ర్ ఆద్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముంజ మల్లయ్య, చంగర్ల మహేందర్, పవనూర శంకర్, ముత్యాల శ్రీధర్, కింగర్ సది, గుజ్జుల కనకయ్య, బలంతుల రాజేశం, గోస్కుల రాములు, బ లవంతుల సది, బలంతుల రాజు,తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన కులాల ఆర్థికాభివృద్ధే మోడీ లక్ష్యం

- జిల్లా బిజెపి అధ్యక్షులు రఘునాథ్



మంచిర్యాల, అక్టోబర్ 10, (మనం న్యూస్): వెనుకబడిన కులాల ప్రజల ఆర్థికాభివృద్ధే ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమని బిజెపి జిల్లా అధ్యక్షులు ఎరవెల్లి రఘునాథ్ తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని వెనుకబడిన కులాల వారు ఉపయోగించుకోవాలని సూచించారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ కృషి వల్ల అనేక పథకాలు, జాతీయ రహదారుల నిర్మాణం, సంక్షేమ పథకాలతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన కులవృత్తుల వారు, ముఖ్యంగా బిసి కులాలవారు కార్పొరేట్ సంస్థలతో పోటీ పడి అభివృద్ధి చెందడానికి విశ్వ కర్మ పథకం అమలుచేస్తున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల కోసం పని చేసే పార్టీ బిజెపి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆలోచించి విశ్వకర్మ యోజన కింద 18 రకాల కులాలకు 13 వేల కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. స్వర్ణ కారులు, నాయిబ్రహ్మణులు, రజకులు, మేర, వడ్రంగులు కమ్మరి, కుమ్మరి తదితర అన్ని రకాల కుల సంఘాలు చేతివృత్తుల వారు ఉపయోగించుకొని వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంలో చేరిన వారికి శిక్షణ ఇస్తారని, శిక్షణలో పాల్గొన్నందుకు స్టైఫండ్, సర్టిఫికేట్, పదిహేను రూపాయల విలువగల కిట్, తక్కువ వడ్డీతో మూడు లక్షల రుణం ఇస్తారని వివరించారు. అంతేకాకుండా పేద ప్రజలను మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం కోసమే ఈ పథకాన్ని ప్రత్యక్షంగా అర్హులకు చేరాలనే ఉద్దేశ్యంతో నరేంద్ర మోడీ ఆశయమని, అందుకోసమే ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా అకౌంట్లోనే జమచేసే విధంగా కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లలో ఉన్న కులవృత్తుల వారందరూ ఈ పథకంలో చేరాలని ఆన్లైన్ పోర్టల్‌లో వారి వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తులా ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోయిని హరికృష్ణరావు, వివిధ కుల సంఘాల అధ్యక్షులు కె. సంజీవ్, వెంకటి, పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలు ప్రారంభం



ఖమ్మం, అక్టోబర్ 10, (మనం బ్యూరో): స్వేచ్ఛ, న్యాయ బద్ధ ఎన్నికల నిర్వహణ జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటర్లను డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకై ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టి బృందాలను నిఘాను ఏర్పాటుచేసిన ట్లు తెలిపారు. జిల్లాలో 15 ఫ్లయింగ్ స్క్వాడ్, 24 ఎంసిసి, 15 ఎస్ఎస్టి బృందాలను ఏర్పాటుచేసినట్లు ఆయన అన్నారు. 8 గంటల షిఫ్ట్ చొప్పున 24 గంటలు ఈ బృందాలు పనిచేస్తాయన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లో ఒక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, పోలీస్, వీడియో గ్రాఫర్‌లు ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, డిఆర్డీఓ విద్యాచందన, సిపిఓ ఏ. శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణు మనోహర్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారీగా హవాలా నగదు పట్టివేత

హైదరాబాద్, అక్టోబర్ 10 (మనం న్యూస్): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో హైదరాబాద్ సహా జిల్లాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు ప్రారంభించారు. తాజాగా, బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో భారీగా హవాలా నగదు పట్టుకున్నారు. రూ.3.35 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు.. ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, దీనిలో భాగంగా వాహన తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నామని వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డెవిస్ తెలిపారు. నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ స్పోర్ట్స్ పోలీసులతో పాటు బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారని, రోడ్ నెంబర్-3 వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న కియా కారును తనిఖీ చేయగా మూడు కోట్ల 35 లక్షల నగదు పట్టుబడిందని డీసీపీ వెల్లడించారు. పట్టుబడిన నగదు హవాలా మనీగా గుర్తించాం.. హనుమంతరెడ్డి, బచ్చల ప్రభాకర్, మండల శ్రీరాములు రెడ్డి, ఉదయ్ కుమార్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. హనుమంత్ రెడ్డి సూచన మేరకు ప్రభాకర్, శ్రీ రాములు, ఉదయ్ కుమార్ హవాలా మనీ సేకరిస్తూ ఉంటారు. ఇందుకోసం అరోరా కాలనీలో సాయి కృప బిల్డింగ్ ప్లాట్ నెంబర్ 583 తమ కార్యాలయంగా ఏర్పాటు చేసుకున్నారు. సేకరించిన హవాలా డబ్బులు తమ కార్యాలయానికి తీసుకెళ్తుండగా సీజ్ చేశాం. కోటి హవాలా మనీకి 25,000 కమిషన్గా తీసుకుంటారు. ఇవాళ ఉదయం ప్రభాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి.. బేగంబజార్, నాంపల్లి, గోషామహల్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో మూడు కోట్ల 35 లక్షలను కలెక్ట్ చేశారు. పట్టుకున్న నగదును కోర్టులకు అప్పగిస్తాం. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వాహన తనిఖీలు మరింత విస్తృతంగా చేస్తామని డీసీపీ పేర్కొన్నారు.

### రంగా రెడ్డి జిల్లాలో..

వాహన తనిఖీల్లో 6.55 లక్షల రూపాయలను ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకున్నారు. పూర్తిస్థాయి విచారణ నిమిత్తం నగదను ఇబ్రహీంపట్నం ఆర్డీవోకి అప్పగించారు. కాగా, ఎన్నికల్లో అక్రమంగా డబ్బు, మద్యం పంపిణీని అరికట్టేందుకు ఎక్కడికక్కడ చెక్పోస్టులు, నాకా బందీలు పెట్టి సోదాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు.

# బిసిల సాధికారతే బీఆర్ఎస్ లక్ష్యం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 10, (మనం న్యూస్) : దేశవ్యాప్తంగా ఉన్న బిసిలకు న్యాయం జరిపేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఉందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం నగరంలోని జనార్దన్ గార్డెన్‌లో నాయి బ్రాహ్మణులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథులుగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తాతో కలిసి హాజరైనారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బిసిలకు న్యాయం జరిపించటమే బిఆర్ఎస్ లక్ష్యమని ఆమె అన్నారు. కాంగ్రెస్ పాలనలో బిసిలను ఎందుకు పట్టించుకోలేదో. రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నాయి బ్రాహ్మణులు అంటే విట్టలేశ్వరునికి క్షవరం చేసిన చరిత్ర గలిగిన వారు అని పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణుల కుల వృత్తిని కాపాడేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని కవిత అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల సెలూన్‌లకు సబ్సిడీ విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. కుల వృత్తులు ప్రోత్సహిస్తూ మరో వైపు విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. 12 లక్షల కళ్యాణ లక్ష్మి లబ్ధిదారుల్లో 7 లక్షలు బిసి లబ్ధిదారులున్నారని ఆమె అన్నారు. గతంలో పని చేసిన ప్రభుత్వాలు బిసిలను, కులవృతుల ను నిర్లక్ష్యం చేశాయన్నారు. కెసిఆర్ ప్రభుత్వం కులవృత్తులు ప్రోత్సహిస్తూ, మరో వైపు విద్యాపరంగా ఎంతో ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. బిసిలకు 33 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో మొట్ట మొదట తీర్మాణం చేసిన నాయకులు కెసిఆర్ మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. 60 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ హయాంలో బిసి గణన ఎందుకు జరగలేదో..? రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న బిసిలకు న్యాయం జరగాలన్నారు. రెండు సార్లు ఆశీర్వదించి గెలిపించారు. మళ్లీ బిఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీ తో గెలిపించాలని ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల కులవృత్తిని గౌరవించి ప్రభుత్వపరంగా అంది సంక్షేమ ఫలాలను నేరుగా వారికి చేరే విధంగా ఎంతో కృషి చేశామన్నారు. హ్యాట్రిక్ గా గెలిపించండి మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాయి బ్రాహ్మణులను ఎక్కడ కించపరచలేదని ఆయన అన్నారు. అంతకుముందు నాయి బ్రాహ్మణుల జిల్లా, నగర సంఘాల సభ్యులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తాకు ఘనంగా స్వాగతించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, నాయి బ్రాహ్మణుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నగర అధ్యక్ష కార్యదర్శులు తోపాటు నాయి బ్రాహ్మణుల కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కిసాన్ సెల్ పట్టణాధ్యక్షులుగా బాలకిషన్



ఆర్మూర్, అక్టోబర్ 10, (మనం న్యూస్): ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులుగా బోడమీది బాలకిషన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్, పిసిసి ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్, జిల్లా అధ్యక్షులు మానాల గంగారెడ్డిలు నియామకపు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబ గౌడ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా సెంటర్, మానిటరింగ్ సెల్ ప్రారంభం



ఖమ్మం, అక్టోబర్ 10, (మనం బ్యూరో) : నూతన కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ సెల్‌ను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలో టెలివిజన్లు, ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సంబంధ వార్తలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు చేర వేయాలన్నారు. ఎన్నికల సంబంధిత ప్రకటనలు, ప్రచారాలపై గట్టి నిఘా పెట్టాలన్నారు. ప్రకటన, ప్రచారానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడి యాలలో ఖర్చు విషయమై రేట్ కార్డు ను పొంది, ఆ ప్రకారం ఎప్ప టికప్పుడు సంబంధిత పార్టీ, అభ్యర్థుల ఖర్చులో పొందుపర్చే విధంగా వ్యయ పరిశీలకునికి సమర్పించాలన్నారు. ఎన్నికల విధులు అత్యంత కీలకమయినవని, సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా పౌరసంబంధాల అధికారి ఎం.ఏ. గౌస్, అదనపు పౌరసం బంధాల అధికారి వి. శ్రీనివాసరావు, ఎంసిఎంసి కమిటీ సభ్యులు వి.వి.ఆర్.ఆర్.పి. ఫణికుమార్, సీనియర్ పాత్రికేయులు ఎన్. వెంకట్రా వు, డిపిఆర్వో కార్యాలయ టైపిస్టు ఎస్. శ్రీనివాసరావు, సిబ్బంది త దితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- ఎన్నికల వ్యయం పరిశీలనకు పక్కాగా ఏర్పాట్లు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్, ప్రతినిధి, అక్టోబర్ 10, (మనం న్యూస్) : ఎన్నికల వ్యయ పరిశీలన కోసం ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున అన్ని రాజకీయ పక్షాలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని తు.చ తప్పక పాటించాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల ఖర్చును నిశితంగా పరిశీలన జరిపేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎప్పటికప్పుడు ఎన్నికల వ్యయం వివరాలను తెలియజేయాల్సి ఉంటుందని సూచించారు. శాసన సభకు పోటీ చేసే అభ్యర్థి రూ. 40 లక్షలకు మించకుండా, పార్లమెంటు స్థానానికి పోటీ చేసే అభ్యర్థి 95 లక్షల రూపాయలకు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అందించిన ఓటరు తుది జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. అర్హులైన ఓటర్లు అందరు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చొరవ చూపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ముఖ్యంగా అర్బన్ ఏరియాలో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీల కోసం కనీసం 48 గంటల ముందు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత్రి పది గంటల తరువాత మైకులు వాడేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1950కు ఫిర్యాదు చేయవచ్చని, సి-విజిల్ యాప్ ద్వారా లైవ్ ఫోటోలు, వీడియోల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు స్పందిస్తాయని, ఈ బృందాల కదలికలను కూడా యాప్ ద్వారా ట్రాక్ చేసే వెసులుబాటు ఉందని కలెక్టర్ తెలిపారు. 80 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, ఓటరు జాబితాలో మార్కింగ్ కలిగిన దివ్యంగ ఓటర్లు తమ ఇంటి నుండే ఓటు వేసే వెసులుబాటు ఉన్నందున అవసరమైన వారు 12 డీ ఫారం నింపి నవంబర్ 7 వ తేదీ లోపు బిఎల్ఓలకు అందజేయాలన్నారు. 40 శాతానికి మించి వైకల్యం కలిగిన దివ్యంగులకు మాత్రమే ఇంటి నుండి ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలి. కాగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మంగళవారం నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కౌంటింగ్ సూపెర్వైజర్లు, అబ్జర్వర్ల నియామకాల కోసం సరిపడా సిబ్బందిని గుర్తిస్తూ, ర్యాండమైజేషన్ ద్వారా నియామకాలు జరపాలని సూచించారు. కనీసం 20 శాతం మేర సిబ్బందిని రిజర్వులో సిద్ధంగా ఉంచాలని అన్నారు. పోలింగ్, కౌంటింగ్ విధుల కోసం వేర్వేరుగా సిబ్బందిని నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల వారికి పూర్తి అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, పోలింగ్ సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటదివెంట నివేదికలు సమర్పించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమ మద్యం, నగదు నిల్వలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్స్, ర్యాంపులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## దేశంలో ఎక్కడాలేని విధంగా గౌడ కులస్తులకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 10, (మనం న్యూస్) : భారతదేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలోని గౌడల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఎంతో కృషి చేస్తున్నారని, ముఖ్యంగా గౌడ్ కులస్తుల ఆత్మ గౌరవాన్ని కాపాడుతూ కుల వృత్తులను గుర్తించి ప్రతి ఒక్కరి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడం బిఆర్ఎస్ ప్రభుత్వానికి సాధ్యమవుతుందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం నగరంలోని నిజామాబాద్ కంటేశ్వర్‌లో గౌడ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత,ఎమ్మెల్యే గణేష్ గుప్తా పాల్గొన్నారు. గౌడ్ కులస్తులు తమ కులవృత్తుల వేషధారణలో గీత కార్మిక కుటుంబాలు ఘనంగా స్వాగతించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అంటే బిసిల ప్రభుత్వం, కన్న తల్లి వంటి కుల వృత్తులకు బిఅర్ఎస్ పాలనలో పూర్వ వైభవం తీసుకొచ్చిందన్నారు. కుల వృత్తులు పూర్వ వైనవం తీసుకువస్తున్న నాయకులు కేసీఆర్ మాత్రమేనన్నారు. మొట్టమొదటి సమావేశం గౌడ కుల బాంధవులతో జరురుకోవటం సంతోషకరమని విషయమన్నారు. గత ప్రభుత్వాలు గౌడ కులస్తులను కల్లు వ్యాపారాన్ని చిన్న చూపు చూశారన్నారు. కానీ కేసీఆర్ అన్నదే ఉద్యమ సమయంలో చెప్పారు. తెలంగాణ ఏర్పాటు అయితే గౌడ కులస్తులు అండగా ఉంటామన్నారు. అలాంటి కులవృత్తులను పునరుద్ధరించేందుకు సీఎం కేసీఆర్ విశేషంగా కృషి చేస్తున్నారని ఆమె అన్నారు. గీత కార్మికులకు ఏమైనా సమస్యలు ఉంటే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తాము అదే విధంగా కృషి చేస్తామని ఆమె భరోసా కల్పించారు. ప్రభుత్వం పాలసీ గా తీసుకొని ఈత వనాలను పెంచుతుందని, ఇలాంటి సంక్షేమ పథకాలు ఎంతో మంది గౌడ కులస్తులకు, కుటుంబాలకు ఆదుకోవడం జరుగుతుందన్నారు. మద్యం టెండర్లలో 15 శాతం గౌడ కులస్తులకు రిజర్వేషన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతినీ అధికారికంగా నిర్వహిస్తున్నమని ఆమె తెలియజేశారు. గత ప్రభుత్వాల కాలంలో నిజామాబాద్ నుండి ఎంతో మంది పెద్దనాయకులు పనిచేశారని ఎవరు కూడా గౌడ సంఘాలను గుర్తించలేదని కవిత పేర్కొన్నారు. జిల్లాకు ఒకటే బిసి హాస్టల్ ఉండేదని, అలాంటిది ఈరోజు 15 బిసి హాస్టల్‌లను ఏర్పాటు చేసుకున్నామని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది బిసి బిడ్డలకు ఫీజు రియంబర్స్ మెంట్ ఇస్తున్నట్లు తెలిపారు. పనిచేశాం కాబట్టి హక్కుగా ప్రజల వద్దకు వస్తున్నామని, తమను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 3 తర్వాత మళ్లీ ఏర్పడేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ నగరంలో ఉన్న అన్ని కల్లు డిపో సొసైటీలను గుర్తింపు పొందినందుకు ఎంతో కృషి చేశామన్నారు. అంతేకాకుండా గౌడ కులస్తుల సంఘాలను అభివృద్ధి చేసేందుకు గతంలోనే ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. మరింత అభివృద్ధి చేసేందుకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా, నిజామాబాద్ ఎంపీగా కల్వకుంట్ల కవితక్కను భారీ మెజార్టీతో గెలిపించి మరింత అభివృద్ధి చేసేందుకు ఆశీర్వదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విజిగౌడ్, నగర మేయర్ దండు నీతు కిరణ్, మాజీ ఎమ్మెల్సీ, మహిళ రాష్ట్ర నాయకురాలు ఆకుల లలిత, గౌడ కుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు తో పాటు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పథకాలు పేరు చెప్పి ప్రజలను మోసం చేశారు

- భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య




భద్రాచలం, అక్టోబర్ 10, (మనం న్యూస్) : పదేళ్ళ కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వపు హామీలు, మోసపూరిత పథకాల పేరుతో తెలంగాణలోని పేద ప్రజలను పచ్చిగా మోసం చేశారని భద్రాచలం ఎంఎల్ఏ పొదెం వీరయ్య పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ప్రతి పేద దళితుడికి దళిత బంధు ఇచ్చినాకే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానన్న కేసిఆర్, ఆ పథకాన్ని పూర్తిస్థాయిలో రాష్ట్రంలో అమలు చేయకుండానే ఎన్నికలకు సిద్ధమయ్యాడని విమర్శించారు. పేద ప్రజలకు డబుల్ బెడ్ రూములు ఇస్తానని, గృహలక్ష్మి పథకాం ద్వారా ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పారని, వాళ్ల మాయ మాటలు నమ్మి పేదలు గుడిశెలు పీకేసుకున్నారని అన్నారు. ఇలా పథకాల పేరుతో దళిత, గిరిజన, మైనారిటీ, బహుజనులను బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. నవంబర్ 30వ తేదీన జరగబోవు అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు వారి ఓటు హక్కు ద్వారా బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్, కోఆర్డినేటర్, టిపిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతరేల రవికుమార్, దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు లంక అబ్బులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బంధం శ్రీనివాస్ గౌడ్, భత్తుల తిరుపతయ్య, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పులిగుండాల సర్పంచ్ సోడి చలపతి, ఎన్ఎస్ యుఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్,యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు చింతిరేల సుధీర్,యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

## గురుశిష్య పరంపరకు మహోజ్వల చరిత్ర

- 'ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు'



ఖమ్మం, అక్టోబర్ 10, (మనం న్యూస్) : ప్రముఖ కవి రచయిత అట్లూరి.వెంకటరమణ ఆధ్వర్యంలో వారి స్వగృహంలో తన గురువు, మార్గదర్శకుడు గత ఆదివారం (08.10.2023) దివంగతులైన మహా మహోపాధ్యాయ ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు సంస్మరణ సభ నిర్వహించారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి ఆచార్య బూదాటి. వెంకటేశ్వ ర్లు అధ్యక్షత వహించగా ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి సభను సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ పూ ర్వ శాఖాధిపతి మహామహోపాధ్యాయ ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి మాట్లాడుతూ 15 భాషలలో సాధికా రత గల జోస్యుల వారు సృష్టించిన సాహితీ సంపద భారతీయ భాషలకు భగవద్గీత అని అభివ్యర్ణించారు. తెలుగు ప్రజలకు పురాణ ప్రవచన కర్తగా చిరప రిచితులైన మహామహోపాధ్యాయ శలాక. రఘునాథ శర్మ ప్రసంగి స్తూ గత ఆరు దశాబ్దాలుగా తన ఆంతరంగిక మిత్రుని గా, సహచ ర పండితునిగా ఎన్నో అమూల్య విషయాలపై విశ్లేషణతో సందేహా లను తీర్చారని వారి అంతిమ క్షణాల్లో తాను ఉండటం తమ స్నేహానికి లభించిన వరంగా పేర్కొన్నారు. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు యన్.వి. రాజు మాట్లాడుతూ తెలుగు సాహిత్య విమర్శ రంగంలో తాను ఆచార్య సూర్యప్రకాశరావు కలసి నిర్వహించిన అనేక సదస్సులను స్మరించుకున్నారు. ఆంధ్ర విశ్వవి ద్యాలయ పూర్వ ఆచార్యులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మా ట్లాడుతూ త్రిభాషా తులనాత్మక సాహిత్య పరిశోధనలకు శ్రీకా రం చు ట్టిన తొలి తెలుగు రచయిత ఆచార్య జోస్యుల సూర్యప్రకా శరావు అని స్పష్టం చేశారు. వారితో కలసి పనిచేయడం గొప్ప గ్రంథాలయంలో విహరించటమని విశ్వవిద్యాలయ ఆచార్యులు భమిడిపాటి. విశ్వనాథ్ అన్నారు. వారితో కలసి గత మూడున్నర దశాబ్దాలుగా ప్రయాణం శిష్యునిగా గురువు ఆశయాలను ముందు కు తీసుకువెళ్ళటం తనకు దొరికిన వరం అని ఆయన ఆశీస్సులతో మరింత ప్రయాణం చేస్తాన ని ఈ సందర్భంగా అట్లూరి. వెంకటర మణ స్పష్టం చేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో, తంగి రాల సుబ్రహ్మణ్యం, యన్.వి. భారతి, కవులు, రచయితలు, పండి తులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

## చెక్ పోస్టులను పకడ్బందీగా నిర్వహించాలి

- వైరా ఎన్నికల అధికారి సత్య ప్రసాద్

ఏన్కూరు, అక్టోబర్ 10, (మనం న్యూస్): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సరిహద్దుల్లోని చెక్ పోస్టులను పకడ్బందీ గా నిర్వ హించాలని వైరా నియోజకవర్గ ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం ఏన్కూరు-జూలూరుపాడు, ఏన్కూరు-కామేపల్లి మండలాల సరిహద్దుల్లో ఏర్పాటు చే యాల్సిన చెక్ పోస్టుల ప్రదేశాలను ఆయన పరిశీలించారు. చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిఘా పెంచాలని, ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేయాలని ఆదేశించారు. వాహనాలను తనిఖీ చేయాలని అన్నారు. చెక్ పోస్టులలో సీసీ కె మెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఏసిపి రెహమాన్, వైరా, ఏన్కూరు తహసిల్దార్లు శ్రీనివాస్, శేషగి రిరావు, ఎండిఓ టి. కృష్ణ, ఎస్ఐ బాదావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావు వెంటే మేమంతా



చిన్నకోడూరు, అక్టోబర్ 10, (మనం న్యూస్): తాము అడిగిన వెంటనే తమ అవసరాలను తీర్చే మా నాయకుడుమంత్రిహరీష్‌రావు వెంటే మేమంటూ మండల ఏకలవ్య పందుల పెంపకందారుల సహకార సంఘం సభ్యులు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో గంపగుత్తగా మా ఓట్లన్నీ హరీష్‌రావుకే వేస్తామంటూ ఏకగ్రీవ తీర్మాణం చేసి తీర్మాణ పత్రాన్ని ఎంపిపి మాణిక్యరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్‌లకు అప్పగించారు. మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాతూ గత ప్రభుత్వాలు ఎన్నడూ తమను పట్టించుకోలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎరుకలకు సముచిత స్థానం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఉమేష్‌చంద్ర, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్, వైస్ ఎంపిపి పాపయ్య, , ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఏకలవ్య సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బండి తిరుపతి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



కొండపాక, అక్టోబర్ 10, (మనం న్యూస్): కొండపాక మండల పరిధిలోని ధమ్మక్కపల్లి గ్రామంలో మెడిసిటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిభిరంలో బిపి, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతోపాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కణతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిభిరంలో 120 మందికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారికి 35 మందిని మెడిసిటీ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. వారికి ఆసుపత్రిలో ఆపరేషన్‌లు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, వైద్యులు డా. అఖిల, భాస్కర్, ఆనంద్, మార్కెటింగ్ నవీన్ , గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ చోరీ నిందితుల అరెస్ట్

- 24 గంటల్లోనే ఛేదించిన మిరుదొడ్డి పోలీసులు



మిరుదొడ్డి, అక్టోబర్ 10, (మనం న్యూస్): మిరుదొడ్డి మండల పరధిలోని ధర్మారం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో చోరీ ఘటనకు పాల్పడిన నిందితులను మిరుదొడ్డి పోలీసులు 24 గంటల్లోనే పట్టుకున్నారు. మిరుదొడ్డి ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం అంగన్‌వాడి కేంద్రంలో దొంగిలించిన పోషకాహారాలు, ఇతరత్రా సామాగ్రి గురించి దర్యాప్తు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన అరవింద్ అనే వ్యక్తిపై అనుమానంతో అతని ఇంట్లో పరిశీలించగా పలు సరుకులపై సీఎం కేసీఆర్ బొమ్మ ఉండడం గుర్తించడం జరిగిందన్నారు. అతనిపై అనుమానంతో ఇళ్లంతా సోదా చేయగా అంగన్‌వాడి కేంద్రంలో దొంగిలించిన సరుకులను రికవరీ చేయడం జరిగిందని, నిందితుడు అరవింద్‌ను సైతం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

## ముందస్తు అనుమతి లేకుండా రావద్దు

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవి రంగనాథ్



వరంగల్, అక్టోబర్ 10, (మనం న్యూస్) : ఎన్నికల నిబంధనలు అమలవుతున్న వేళ ఇకపై ఎవరైనా ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదులను పోలీస్ కమిషనర్‌కు అందజేసేందుకు పోలీస్ కమిషనరేట్ కార్యాలయమునకు రావద్దని, ఏవైనా అత్యవసరమైన ఫిర్యాదులు చేయాలనుకున్నవారు ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సర్కిల్ ఇన్స్పెక్టర్, ఏసిపి, డిసిపి స్థాయి అధికారులకు ముందుగా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. మీరు చేసిన ఫిర్యాదుపై అధికారుల నుండి సరైన స్పందన లేకున్నా న్యాయం జరగలేదని అనుకున్నప్పుడు లేదా పోలీస్ అధికారుల పనితీరుపై ఫిర్యాదులు అందజేయాలనుకున్న ఫిర్యాదుదారులు 8712685100 వాట్సాప్ నంబర్ సంక్షిప్త మెసేజెలు లేదా వాయిస్ మెసేజ్‌లను చేయాల్సి వుంటుంది. ఇలా వచ్చిన మెసేజ్ లను పరిశీలించిన అనంతరం ఫిర్యాదు దారులు పోలీస్ కమిషనర్ ను ప్రత్యక్షంగా కలిసేందుకు సమయాన్ని కేటాయించ బడుతుంది. కేటాయించిన సమయంలో మాత్రమే ఫిర్యాదు దారులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయమునకు రావాల్సి ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటన తెలియజేసారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

వరంగల్ కల్చరల్, అక్టోబర్ 10, (మనం న్యూస్) : వర్ధన్నపేట మండలంలోని కడారి గూడెంలో తెలంగాణ సాంస్కతిక సారథి కళాకారులు మంగళవారం ఓటు హక్కును వినియోగించుకోవాలని కడారి గూడెం ప్రజలకు తెలియజేశారు. వర్ధన్నపేట టిఎస్ఎస్ కళాబందం టీం లీడర్ గొలుసుల రంజిత్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కతిక సారధి కళాకారుల ఆటపాట జరిగింది 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు తమ పేర్లను నమోదు చేసుకొని ఓటర్ కార్డును పొందవలసిందిగా వారు తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కతిక సారధి కళాకారులు గొలుసుల రంజిత్, మోరే సంపత్ బరిగల వెంకటేశ్వర్లు, కుమార్, బరిగల బాబు, ఇజ్జగిరి గణేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

# టికెట్ ఎవ్వరికి ?

- తేలని అభ్యర్థిత్వాలు
- ఒక వైపు ప్రచారంలో కారు జోరు
- అయోమయంలో ప్రతిపక్ష కార్యకర్తలు









సిద్దిపేట, అక్టోబర్ 10, (మనం న్యూస్ ప్రతినిధి): సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ వెలువడ్డప్పటికీ బిఆర్ఎస్ మినహా మరే పార్టీలోనూ ఆశించిన స్థాయిలో వేగం కనిపించడం లేదు. అధికారంలోకి రావడమే లక్ష్యమంటూ స్పీచ్‌లు దంచడం తప్పదితే ఆచరణలో మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. మరీ ముఖ్యమంగా సిద్దిపేట జిల్లాలో ఈ పరిస్థితి కాస్త ఎక్కువగానే ఉందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో భాగ్యమైన సిద్దిపేటలో ఉన్న నాలుగు అసెంబ్లీ స్థానాల్లో ఎవరు పోటీ చేస్తారనే విషయంలో స్పష్టత రాకపోవడం మూలంగా కార్యకర్తల్లో అంతకంతకూ నైరాశ్యం పెరుగుతోంది. గత రెండు నెలల నుండే బిఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు పూర్తి స్థాయిలో సంసిద్ధమై ఏకకాలంలో అభ్యర్థుల ప్రకటన, బిఆర్ఎస్ ముఖ్య నాయకుల జిల్లా టూర్లు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో షెడ్యూల్ వెలువడే అరగంట ముందు వరకు బిజీబిజీగా గడిపారు. బిఆర్ఎస్ పార్టీ సిద్దిపేట జిల్లాలో అత్యంత బలంగా ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. గజ్వేల్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, సిద్దిపేట నుండి మంత్రి హరీష్‌రావులు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంలో ఆచితూచి అడుగేస్తున్నాయనే చెప్పవచ్చు. ఈనెల 15వ తేదీన మేనిఫెస్టోను ప్రకటించడే కాకుండా అచ్చొచ్చిన హుస్నాబాద్ నియోజకవర్గం నుండి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టునున్నారు. మరో రెండు రోజుల్లో హుస్నాబాద్‌లో, మరో రెండు రోజుల గడువులోనే సిద్దిపేటలో కేసీఆర్ నేతృత్వంలో బహిరంగ సభ జరగనుందన్న సమాచారం తెలుస్తుంది. ఏది ఏమైనా కారు ప్రచారంలో దూసుకుపోతుంటే ప్రతిపక్షాలు మాత్రం కనీసం పదిశాతం కార్యక్రమాలను కూడా నిర్వహించలేకపోతున్నారని,కార్యకర్తల్లో ఆవేదన వ్యక్తమవుతుంది.

### - ప్రకటించేదెప్పుడు?

కాంగ్రెస్, బీజేపి పార్టీలు అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తారన్న ఉత్కంఠ సర్వత్రా వ్యక్తమవుతుంది. అభ్యర్థులను ముందస్తుగా ప్రకటిస్తే పూర్తి స్థాయిలో ఎన్నికలకు సిద్ధమ వడమే కాకుండా ఆర్థిక పరమైన అంశాల ఇబ్బంది లేకుండా కూడా చూసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే అభ్యర్థులను ప్రకటించడంలో ఆలస్యమవుతున్న కొద్దీ పార్టీని నమ్ముకున్న వారి మధ్య విభేదాలు వచ్చే పరిస్థితులూ ఉంటాయి. ఈ నేపథ్యంలోబీజేపి, కాంగ్రెస్ అభ్యర్థులు ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా అభ్యర్థులను ప్రకటిస్తే అనుకున్న స్థాయి ఫలితాలు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. సిద్దిపేట జిల్లాలోని బిఆర్ఎస్ పక్షాన సిద్దిపేట నియోజకవర్గం నుండి టి. హరీష్‌రావు, గజ్వేల్ నుండి కేసీఆర్, దుబ్బాక నుండి కొత్త ప్రభాకర్‌రెడ్డి, హుస్నాబాద్ నుండి వొడితల సతీష్‌కుమార్, జిల్లా పరిధిలో ఆనుకొని ఉన్న మానకొండూరు నుండి రసమయి బాలకిషన్ పేర్లు, జనగామ నుండి పల్లా రాజేశ్వర్ పేరు కూడా దాదాపు ఖరారు కాగా ఇప్పటికే మండలాల వారీగా ఆత్మీయ సమావేశాలు, విద్యార్థి విభాగం, సోషల్ మీడియా కన్వీనర్లతో భేటీలు, ఓటరు లిస్టుల అందజేత, వంద మందికి ఒక ఇంచార్జ్ చొప్పున నియామకం, 15వ తేదీన మేనిఫెస్టో, మరుక్షణం నుండే జిల్లాలో పర్యటనలు కేసీఆర్ నేతృత్వంలో సాగడంతో బిఆర్ఎస్‌లో ఉత్సాహం కనిపిస్తూ మూడోసారి కేసీఆరే అన్న స్లోగన్ వినిపిస్తోంది. ఇక కాంగ్రెస్, బీజేపిలు అభ్యర్థులను ఖరారు చేసే విషయంలో అధిష్టానాలు ఆచితూచి వ్యవహరించడంతో కార్యకర్తల్లో నైరాష్యం కనిపిస్తోంది. ఏ ఒక్క నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారన్న బలంతోనే టికెట్లను ఆశించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. గజ్వేల్ నుండి తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట నుండి మర్కంటి భవానిరెడ్డి, దరిపల్లి చంద్రం, పూజల హరికృష్ణలు, దుబ్బాక నుండి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కత్తి కార్తీక, హుస్నాబాద్ నుండి పొన్నం ప్రభాకర్, ప్రవీణ్‌రెడ్డి, జనగామ నియోజకవర్గం నుండి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తున్నప్పటికీ అధికారికంగా ప్రకటించకపోవడంతో వీరికే అవకాశం దక్కుతుందా, లేదా మరెవరికైనా టికెట్ ఇస్తారన్న ఆవేదనను కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. బీజేపి పార్టీలోనూ ఇదే సాగదీత ధోరణి కనిపిస్తోంది. గజ్వేల్ నుండి దారం గురువారెడ్డి, దుబ్బాక నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, సిద్దిపేట నుండి దూది శ్రీకాంత్‌రెడ్డి, కొత్తపల్లి వేణుగోపాల్, హుస్నాబాద్ నుండి శ్రీరాం చక్రవర్తి, మంజుల రెడ్డి, జనగామ నుండి సురేష్‌గౌడ్, సురేష్‌లు టికెట్‌లు ఆశిస్తున్నప్పటికీ ఎప్పుడు ఎవరికి అధిష్టానం ఆశీస్సులు ఉంటాయో తేలాల్సి ఉంది. అభ్యర్థుల ప్రకటన ఆలస్యమవుతున్నకొద్దీ అభ్యర్థులకు ప్రచారం చేసుకునే అవకాశం దక్కకపోవడంతోపాటు ఆర్థికపరమైన సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఏది ఏమైనా ఆలస్యమైతే మాత్రం ఆశలు అడియాశలవుతాయన్న కార్యకర్తల అభిప్రాయాన్ని మన్నించి అధిష్టానాలు వెనువెంటనే టికెట్లను ప్రకటించాలని కోరుతున్నారు.

## రైతు రుణమాఫీ, కొత్త రుణాల ప్రక్రియ వేగవంతం చేయాలి

- బ్యాంకర్లు పెండింగ్ పనులపై దృష్టి సారించాలి
- జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్




సిద్దిపేట, అక్టోబర్ 10, (మనం న్యూస్ ప్రతినిధి): రైతులకు రుణమాఫీ ప్రక్రియ, కొత్త రుణాల పంపిణీ ప్రక్రియను బ్యాంకర్లు వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో జిల్లాలోని బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులతో రైతు రుణమాఫీ ప్రక్రియ, కొత్త రుణాల పంపిణీ గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఏపిజివిబి బ్యాంకులో 7876 మంది రైతులకు రూ. 33.26 కోట్లు, ఎస్‌బిఐ బ్యాంక్‌లో 2740 మందికి రూ. 21.92 కోట్లు, యుబిఐ బ్యాంక్‌లో 2762 మంది రైతులకు రూ. 15.45 కోటుఌ, ఇతరత్రా బ్యాంకుల్లో సుమారు 10272 అకౌంట్లకు రూ. 25 కోట్లు పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ నగదును వేగంగా రైతులకు అందించాలని బ్యాంకర్లకు సూచంచారు. డిబిటి ఫెయిల్యూర్‌లో ఉన్న 199 ఖాతాలకు రైతు రుణమాఫీ పోర్టల్ ఎస్‌బిఐ, ఏపిజివిబి బ్యాంకుల్లో అప్‌లోడ్ చేయాలని కోరారు. వివిధ బ్యాంకులలో పెండింగ్‌లో ఉన్న రుణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు కొత్త రుణాలు పొందేందుకు అర్హత కలిగిన రైతులకు బ్యాంకర్లతో సమావేశమై రుణాలందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి క్రాప్‌లోన్‌లు తీసుకునేలా రైతులను ప్రోత్సహించాలని, బ్యాంకులు రోజుకు వంద చొప్పున రుణాలు అందించాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపార రుణాలను మెప్మా అధికారుల సాయంతో బ్యాంకు మేనేజర్‌లు అందించాలని ఆదేశించారు. ఆహార ఉత్పత్తి, పిఎంఎఫ్ఎంఈ పరిధిలోని 54 యూనిట్లు వేగంగా పూర్తి చేయాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున బ్యాంకు, వ్యవసాయ అధికారులు ఎన్నికల కమీషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ సత్యజిత్, డిఆర్‌డిఏ పిడి జయదేవ్ ఆర్యాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ సాధించే వరకు పోరాటం ఆగదు

- ఫోటో వీడియో గ్రాఫర్ల సంఘం



చేర్యాల, అక్టోబర్ 10, (మనం న్యూస్): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటం ఆపేది లేదని ఫోటో, వీడియో గ్రాఫర్ల సంఘం యూనియన్ జిల్లా అధ్యక్షులు డొంతు శ్రీకాంత్ అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన దీక్షలు మంగళవారం 30 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో నాలుగు మండలాల ఫోటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. వారికి ఆయా పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసిగా కొన్ని సంవత్సరాలుగా అనేక పోరాటాలు నిర్వహిస్తుంటే ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత నాలుగు మండలాల ప్రజల చిరకాల కోరిక ఆకాంక్షను ప్రభుత్వం వెంటనే గుర్తించి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యమంలో ఫోటో, వీడియోగ్రాఫర్లు సంపూర్ణ మద్దతు తెలుపుతూ భాగస్వాములవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటో వీడియో గ్రాఫర్ల యూనియన్ అధ్యక్షులు గుడాల రాజు, ప్రధాన కార్యదర్శి, ఇప్పకాయల పవన్, కోశాధికారి కోయినేని శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు రాజగిరి గోవర్ధన్‌కడుదూరి మహేందర్‌రెడ్డి, కర్క చంద్రారెడ్డి, కొమురవెల్లి అధ్యక్షులు చిప్ప శ్రీనివాస్ దూల్మిట్ట అధ్యక్షులు గొంటిపల్లి కిషన్, కూరపాటి మధు, తాడెం యాదగిరి, నర్సింగరావు, హరి, సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## లైసెన్స్ తుపాకులను డిపాజిట్ చేయాలి

- నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ
- పోలీస్ కమీషనర్ శ్వేత



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 10, మనం న్యూస్ః తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లలో తమ తుపాకులను డిపాజిట్ చేయాలని పోలీస్ కమీషనర్ శ్వేత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ లైసెన్స్ కలిగి ఉన్న తుపాకులను ఈనెల 16వ తేదీ లోపు డిపాజిట్ చేయని వారిపై ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లైసెన్స్ తుపాకులు డిపాజిట్ చేసిన వారు ఎన్నికలు ముగిసన తర్వాత తీసుకోవచ్చున్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వాణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు తప్పకుండా పాటించాలని సూచించారు. జిల్లా బార్డర్లలో పోలీస్ స్టేషన్‌లలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు వాహనాలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.

## ప్రతి వ్యక్తికి మానసిక ఆరోగ్యం చాలా అవసరం

- సురభిలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాలు



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 10, (మనం న్యూస్): నేడు పెరుగుతున్న నాగరికతలో శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ఎంతో అవసరమని సురభి కళాశాల మానసిక వైద్య విభాగం డాక్టర్ హరీష్ పిన్నోజి అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి సైన్స్ అండ్ మెడికల్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం మాట్లాడుతూ నేటి ఆహారపు అలవాట్లు ధూమపానం, మద్యపానం, ఆలోచన విధానం, పని ఒత్తిడి వల్ల కలిగే మానసిక స్థితిగతుల గురించి రోగులకు వివరించారు. యోగా చేయడం, వైద్యుల సలహాలు పాటించడం వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. సురభి కళాశాలలో మానసిక ఆరోగ్యానికి సంబంధించి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు శివరామ చారి, డా. రాజేష్, డా. రఫీ, పిఆర్‌ఓ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 23న దసరా పండుగ

- పురోహితులు విఠల రాజపున్నయ్యశర్మ



మిరుదొడ్డి, అక్టోబర్ 10, (మనం న్యూస్): ఈ సంవత్సరం విజయదశమి పండుగను అక్టోబర్ 23వ తేదీ సోమవారం రోజున జరుపుకోవడం శాస్త్రోపనీయం ప్రకారం ఎంతో ఉత్తమమని గ్రామ పురో హితులు విఠల రాజపున్నయ్యశర్మ తెలిపారు. మంగళవారం రోజున ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం రోజున దశమికి ముఖ్య గౌణకాల వ్యాప్తి లేనందున సోమవారం శ్రవణ నక్షత్ర దశమి స్వర్శమగుట వలన నక్షత్రాలు ఉదయించు సమయము విజయదశమి వ్యాప్తి ఉన్నందున సోమవారం రోజున ప్రజలు విజయదశమి పండు గను జరుపుకోవడం శాస్త్రసమ్మతమని పురోహితులు విఠల రాజపున్నయ్య శర్మ పేర్కొన్నారు. 22వ తేదీ ఆదివారం నాడు సద్దుల బతుకమ్మ జరుపుకొని, 23వ తేదీన దసరా పండుగను జరుపుకోవాలని సూచించారు.

## అరూరికి అండగా మా ముస్లిం మైనారిటీ సోదరులు

- రోజు రోజుకూ పెరుగుతున్న ఏకగ్రీవ తీర్మానాలు
- తాజాగా అరూరి రమేష్ కు జై కొట్టి అండగా నిలిచిన పర్వతగిరి ముస్లిం మైనారిటీ సోదరులు
- అభివృద్దే జెండా అందరినీ కలుపుకొని పోవడమే గులాబీ పార్టీ ఎజెండా అన్న ఎమ్మెల్యే అరూరి రమేష్



వర్ధన్నపేట, అక్టోబర్ 10, (మనం న్యూస్) : వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు సబ్బండ వర్గాల ప్రజలు జై కొడుతున్నారు. వారం రోజులుగా నియోజకవర్గంలో గల్లీగల్లీ తిరుగుతూ వందల కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన అభివద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేస్తున్న అరూరికి జనం అండగా నిలుస్తున్నారు. ముచ్చటగా మూడోసారి గెలిపించుకుంటామని తెలిపారు. చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా, అంతా అరూరి కారుకు జై కొడుతుండటంతో నియోజకవర్గంలో పండగ వాతావరణం నెలకొంది. తాజాగా పర్వతగిరి గ్రామానికి చెందిన ముస్లిం మైనారిటీ సోదరులు అరూరి గెలుపులో మేమూ భాగస్వామ్యం అవుతామని మా మద్దతు అరూరి రమేష్‌కేనని ఏకగ్రీవ తీర్మానం చేసి ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. మూడోసారి కూడా తనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన సోదరులందరికీ ఎమ్మెల్యే అరూరి రమేష్ కతజ్ఞతలు తెలియజేశారు. అభివృద్దే నా జెండా అందరినీ కలుపుకొని పోవడమే గులాబీ పార్టీ ఎజెండా అని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్, పర్వతగిరి సర్పంచ్ చింతపట్ల మాలతి సోమేశ్వర్ రావు, ఎంపిటిసి మాడుగుల రాజు, ఉప సర్పంచ్ రంగు జనార్దన్, శంశుద్దీన్, అంకుస్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచకప్‌కు ఇంగ్లండ్‌కు తొలి విజయం..
## భారీ తేడాతో ఓడిన బంగ్లాదేశ్

న్యూఢిల్లీ: వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ తొలి విజయం సాధించింది. తొలి మ్యాచ్లో న్యూజిలాండ్ చేతిలో ఘోరం పరాజయం చవిచూసిన ఇంగ్లండ్ మంగళ వారం ధర్మశాలలో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో మ్యాచ్లో భారీ విజయం నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 364 పరుగులు చేయగా.. 365 పరుగుల భారీ లక్ష్యంతో బరిలో దిగిన బంగ్లాదేశ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే 227 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 137 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని మూట గట్టుకుంది. కెప్టెన్ లిటన్ దాస్ మినహా టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. ఇంగ్లండ్ బౌలర్ రీస్ టోప్లీ బంగ్లా బ్యాటింగ్ ఆర్డర్ నడ్డి విరిచాడు. రెండో ఓవర్ నాలుగో బంతికే ఓపెనర్ తంజీద్ హసన్ ఒక్క పరుగు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత బంతికే నజ్ముల్ హొసేన్ శాంటోను కూడా ఖాతా తెరవకుండానే టోప్లీ పెవిలియన్కు పంపాడు. అప్పటికి జట్టు స్కోర్ 14/2. ఆరో ఓవర్లో షకీబ్ ఉల్ హసన్ కూడా ఒక్క పరుగు చేసి ఔటయ్యాడు. మెహిదీ హసన్ మిరాజ్ కూడా సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగాడు. ఆ తర్వాత ముష్ఫికర్ రహీమ్ (51; 4 ఫోర్లు), టోవిడ్ హృదయ్ (39; 2 ఫోర్లు) పర్వాలేదనిపించారు. ఇక టెయిలెండర్లు కూడా తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. దాంతో 48.2 ఓవర్లలో 227 పరుగులకు బంగ్లాదేశ్ ఆలౌట్ అయ్యింది. రీస్ టోప్లీ 4 వికెట్లు, క్రిస్ వోక్స్ 2 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఇంగ్లండ్ ఓపెనర్లు జానీ బెయిర్‌స్టో, డేవిడ్ మలాన్ తమ జట్టుకు శుభారంభాన్ని ఇచ్చారు. ఇద్దరు కలిసి 115 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ దశలో షకీబ్ ఉల్ హసన్ బౌలింగ్లో బెయిర్‌స్టో (52; 8 ఫోర్లు) క్లీన్ బౌల్డయ్యాడు. తర్వాత జోయ్ రూట్ వన్ డౌన్‌గా వచ్చి డేవిడ్ మలాన్‌కు జత కలిశాడు. ఈ ఇద్దరు కూడా 151 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేసిన తర్వాత మెహదీ హసన్ బౌలింగ్‌లో మరో సెంచరీ హీరో డేవిడ్ మలాన్ (140; 16 ఫోర్లు, 5 సిక్సు) బౌల్ అయ్యాడు. అప్పటికి ఇంగ్లండ్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 266 పరుగులు. ఆ తర్వాత భారీ స్కోర్ నమోదు చేసే ప్రయత్నంలో బాదుడే పనిగా పెట్టుకుని ఇంగ్లండ్ బ్యాటర్లు వెంటవెంటనే వికెట్లు పారేసుకున్నారు. జోయ్ రూట్ (68; 8 ఫోర్లు, 1 సిక్సర్) నాలుగో వికెట్ రూపంలో వెనుదిరిగాడు. షొరీఫుల్ ఇస్లామ్ బౌలింగ్‌లో ముష్ఫికర్ రహీమ్‌కు క్యాచ్ ఇచ్చి రూట్ ఔటయ్యాడు.

# జైస్వాల్, రుతురాజ్‌కు లక్కీ చాన్స్..

- వరల్డ్‌కప్‌లో బ్యాకప్ ప్లేయర్లుగా పిలుపు వచ్చే అవకాశం



భారీ ఆశలు పెట్టుకున్న భారత యువ ఓపెనర్ శుభ్మన్ గిల్.. కీలక వరల్డ్‌కప్ ప్రారంభానికి ముందు అస్వస్థతకు గురవడంతో.. భారత జట్టు బ్యాకప్‌పై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది పుల్‌ఫామ్ ఉన్న గిల్‌పై మేనేజ్మెంట్‌తో పాటు.. అభిమానులు భారీ అంచనాలు పెట్టుకోగా.. ప్రపంచ కప్‌లో తొలి పోరు ప్రారంభానికి ముందే అతడు డెంగ్యూ బారిన పడ్డాడు. ఫలితంగా ఆదివారం ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌కు గిల్ దూరమయ్యాడు. అతడి స్థానంలో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఓపెనింగ్ చేయగా.. ఇప్పుడు గిల్ మరింత అస్వస్థతకు గురైనట్లు తెలుస్తున్నది. ప్లేట్‌లెట్స్ తక్కువ కావడంతో శుభ్మన్ చెన్నైలోని ఓ దవాఖానాలో చేరాడు. అయితే అతడి పరిస్థితి మెరుగ్గానే ఉన్నా.. పూర్తి స్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించేందుకు ఇంకా సమయం పట్టే అవకాశమున్నట్లు సమాచారం. ఈ నెల 14న అహ్మదాబాద్ వేదికగా పాకిస్థాన్‌తో జరుగనున్న మ్యాచ్ వరకు గిల్ అందు బాటులోకి రావడం సందేహంగానే ఉంది. దీంతో.. భారత యాజమాన్యం ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తున్నది. అతడికి రీప్లేస్మెంట్ కాకపోయినా.. కేవలం బ్యాకప్‌గా మరో ఇద్దరు ఓపెనర్లను సిద్ధంగా ఉంచనున్నట్లు సమాచారం. ఇటీవల ఆసియా క్రీడల్లో భారత జట్టు స్వర్ణ పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించిన యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడును బ్యాకప్‌గా సిద్ధం చేయనుంది. ఐపీఎల్, దేశవాళీలతో పాటు.. ఈ ఇద్దరూ అవకాశం వచ్చినప్పుడల్లా భారత జట్టు తరపున కూడా మెరుగైన ప్రదర్శనలు చేసిన విషయం తెలిసిందే.

# తక్కువ ఇన్నింగ్స్‌లో 6 సెంచరీలు కొట్టి చరిత్ర సృష్టించిన ఇంగ్లండ్ బ్యాటర్



న్యూఢిల్లీ: ఇంగ్లండ్ బ్యాటర్ డేవిడ్ మలాన్ అంతర్జాతీయ వన్‌డే క్రికెట్ చరిత్రలో అరుదైన రికార్డు నెలకొల్పాడు. కేవలం 23 ఇన్నింగ్స్‌లోనే ఆరు సెంచరీలు చేసి ఔరా అనిపించాడు. వన్‌డే ప్రపంచ కప్‌లో భాగంగా హిమాచల్‌ప్రదేశ్లోని ధర్మశాలలో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్లో సెంచరీ (140; 16 ఫోర్లు, 5 సిక్సర్లు) కొట్టడం ద్వారా 36 ఏళ్ల మలాన్ ఈ ఘనత దక్కించుకున్నాడు. డేవిడ్ మలాన్ కంటే ముందు పాకిస్థాన్ బ్యాటర్ ఇమామ్ ఉల్ హక్ పేరిట ఈ రికార్డు ఉన్నది. హక్ 27 ఇన్నింగ్స్‌లో 6 సెంచరీలు చేశాడు. వీరి తర్వాత శ్రీలంక బ్యాటర్ ఉపుల్ తరంగ (29 ఇన్నింగ్స్), పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ (32 ఇన్నింగ్స్), దక్షిణాఫ్రికా బ్యాటర్ హషీమ్ ఆమ్లా (34 ఇన్నింగ్స్) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు.

# కుశాల్ మెండిస్ వీరవిహారం..
## 65 బంతుల్లోనే సెంచరీ



హైదరాబాద్: వన్ డే ప్రపంచకప్‌లో భాగంగా ఉప్పల్లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటర్ కుశాల్ మెండిస్ వీరవిహారం చేశాడు. కేవలం 65 బంతుల్లోనే సూపర్ డూపర్ సెంచరీ కొట్టాడు. ఫోర్లు, సిక్సర్లతో పాకిస్థాన్ ఫీల్డర్లను మైదానం అంతటా పరుగులు పెట్టించాడు. సెంచరీ తర్వాత కూడా అదే జోరు కొనసాగిస్తూ 29వ ఓవర్ ఐదో బంతికి తన 122 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అవుటయ్యాడు.

మెండిస్ (122; 14 ఫోర్లు, 6 సిక్సర్లు) ఔటయ్యేటప్పటికి శ్రీలంక స్కోర్ మూడు వికెట్ల నష్టానికి 218 పరుగులు. కుశాల్ మెండిస్ అవుటైనా పాకిస్థాన్ కష్టాలు తీరలేదు. పాక్ ఫీల్డర్లను పరుగులు పెట్టించే బాధ్యతను సమరవిక్రమ నెత్తికెత్తుకున్నాడు. శ్రీలంక జోరు చూస్తుంటే పాకిస్థాన్ ముందు 350 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఉంచే సూచనలు కనిపిస్తున్నాయి.




# చీటింగ్ కేసులో జరీన్ ఖాన్‌కు ఊరట..!


మనం సినిమా
manamcinema

# ఈసారి గోవాలో సంతోషం అవార్డ్స్
## సీఎంను కలిసిన సురేష్ కొండేటి



సంతోషం అవార్డులకు ఉన్న క్రేజ్ మామూలుది కాదు. ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రోల్ మెటీరియల్ అయినా చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేష్, పవన్ కళ్యాణ్ లాంటి హీరోలతో అవార్డుల ఈవెంట్స్ నిర్వహిస్తూ వచ్చారు సురేష్ కొండేటి. తెలుగు సినిమాలకు గత 21 ఏళ్లకుగా అవార్డులు అందించిన 'సంతోషం' వారపత్రిక ఆధ్వర్యంలో 22వ సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవారడ్స్ 2023 వేడుకలు ఈ ఏడాది గోవాలో గ్రాండ్‌గా జరగనున్నాయని సురేష్ కొండేటి ఒక ప్రకటనలో వెల్లడించారు. అంతేకాదు అందుకు గాను గోవా ముఖ్యమంత్రితో సురేష్ కొండేటి భేటీ అయి గోవాలో ఎలా ఈవెంట్ జరపాలనే అంశం గురించి చర్చలు జరిపారు. ఇక ఆయనతో కలిసి ఉన్న ఫోటోలను సురేష్ కొండేటి సోషల్ మీడియాలో పోస్టు చేశా రు. ఇక ఈ ఏడాది జరగబోయే ఈవెంట్‌కు సంబంధించిన డేట్ త్వరలోనే ప్రకటించనున్నారని, ఈ వేడుకల్లోనే ఓటీటీ అవార్డు లు కూడా ప్రధానం చేయ నున్నారని అంటున్నారు. ముందు తెలుగు సినిమాలకు మాత్రమే అవార్డులు ఇచ్చేవారు కానీ ఇప్పుడు గత కొన్నేళ్లుగా సౌత్ ఇండియాలోని నాలుగు భాషల సినిమాలకు అవార్డులు అంది స్తూ వస్తున్నారు. మరికొద్ది రోజుల్లో జరగబోయే ఈ అవార్డు వేడుకల్లో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ బాషల సినిమాలకు అవార్డులు అందచేయనున్నారని తెలుస్తోంది. గతంలో ఈ ఈవెంట్‌ను దుబాయ్‌లో కూడా నిర్వహించడం గమనార్హం.

# ఇండియాస్ గాట్ టాలెంట్ షోలో టైగర్ నాగేశ్వర రావు టీం సందడి



టాలీవుడ్ యాక్టర్ రవితేజ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం టైగర్ నాగేశ్వర రావు. 1970స్ కాలంలో స్టూవర్టుపురంలో పాపులర్ దొంగగా పేరు గాంచిన టైగర్ నాగేశ్వర్ రావు జీవిత కథగా వస్తోన్న ఈ చిత్రాన్ని వంశీ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీలో బాలీవుడ్ భామ కృతిసనన్ సోదరి నుపుర్ సనన్ హీరోయిన్‌గా నటిస్తుంది. టైగర్ నాగేశ్వర రావు అక్టోబర్ 20న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది మాస్ మహారాజా టీం. హిందీ ప్రమోషన్స్‌లో భాగంగా పాపులర్ రియాలిటీ ఇండియాస్ గాట్ టాలెంట్ షోలో సందడి చేసింది రవితేజ టీం. ఈ సందర్భంగా రవితేజ, గాయత్రి భరద్వాజ్, నుపుర్ సనన్‌తో కలిసి కెమెరాకు ఫోజులిచ్చాడు. ఇప్పుడీ ఫోటోలు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి.

బాలీవుడ్ బ్యూటీ జరీన్ ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఫ్రాడ్ కేసులో జారీ చేసిన అరెస్ట్ వారెంట్ను కోర్టు కోల్‌కతా మేజిస్ట్రేట్ వారెంట్‌ను రద్దు చేశారు. కోల్‌కతాలోని సీల్దా కోర్టు నటిపై వారెంట్‌ను జారీ చేసింది. నటిపై 2018లో కోసు నమోదైంది. దర్యాప్తు అధికారి కోల్కతాలోని సీల్దా కోర్టులో నటిపై చార్జిషీట్ సమర్పించారు. అయితే, జరీన్ ఖాన్ బెయిల్ కోసం అప్పీల్ చేయకపోగా, కోర్టుకు సైతం హాజరు కాలేదు. పదేపదే గైర్హాజరు కావడంతో కోర్టు అరెస్ట్ వారెంటును జారీ చేసింది. 2018లో కోల్‌కతాలో జరిగిన దుర్గామాత పూజ కార్యక్రమంలో బాలీవుడ్ నటి ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. అయితే, ఆమె ముందుగా ఒప్పందం చేసుకున్న విధంగా ప్రదర్శనకు రాలేదు. దీంతో నిర్వాహకుల్లో ఒకరు జరీన్‌తో పాటు ఆమె మేనేజర్ మోసం చేసినట్లు పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు నమోదు చేశారు. ఆ తర్వాత విచారణకు పిలువగా.. గైర్హాజరయ్యారు. విచారణ అనంతరం జరీన్‌పై ఆమె మేనేజర్‌పై చార్జిషీట్ దాఖలు చేసి.. మేనేజర్ కోర్టు ఎదుట హాజరై బెయిల్ కోరారు. జరీన్ మాత్రం కోర్టుకు హాజరు కాకపోవడంతో పాటు బెయిల్ కోసం ప్రయత్నించలేదు. దీంతో కోర్టు వారెంటును జారీ చేసింది. దీనిపై కోల్‌కతా కోర్టులో సవాల్ చేయగా.. నటికి అనుకూలంగా తీర్పును వెలువరించింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.